E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 11-02-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక:44 || పేజీలు–6 www.ekaburu.com




హైదరాబాద్‌లో అక్రమ సరోగసీ రాకెట్... లేడీ డాక్టర్ ను అరెస్ట్ చేసిన ఈడీ

» 3లో

## తెలంగాణ మున్సిపల్ పోరులో

# కాంగ్రెస్ ఘన విజయం



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం మీ నమ్మకమే విజయానికి దోహదం
- కాంగ్రెస్ పార్టీ అందజేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలే ఈ తీర్పుకి కారణం
- మంత్రి సీతక్క వ్యాఖ్యలు..
- రెండవ స్థానంలో బిఆర్ఎస్, మూడవ స్థానంలో బిజెపి

ఈ కబురు, హైదరాబాద్;

**తెలంగాణ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అత్యధిక స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంది.7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలు అధికార కాంగ్రెస్ అభ్యర్థులు విజయ బావుటా ఎగురవేసి ఘన విజయం సాధించారు. ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించింది. గురువారం రాత్రి వరకు అందిన సమాచారం ప్రకారం ప్రకారం**

కాంగ్రెస్ హవా కొనసాగుతుంది. మొత్తం 2,689 వార్డుల ఫలితాల్లో కాంగ్రెస్ 1,500 కంటే ఎక్కువ వార్డులను కైవసం చేసుకుంది.

ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ 765 వార్డులకు పరిమితమై, రెండో స్థానంలో నిలిచింది. ఇక బీజేపీ 286 వార్డులలో విజయం సాధించి, మూడో స్థానంలో నిలిచింది.ఎంఐఎం 59 వార్డులను దక్కించుకుంది.ప్రధాన నగరాలైన కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా కాంగ్రెస్ బలమైన పోటీ ఇచ్చింది.

నల్గొండ జిల్లాలోని హాలియా, చండూరు, నందికొండ, చిట్యాల మున్సిపాలిటీలను కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది.మంత్రి వివేక్ సొంత నియోజకవర్గమైన క్యాతనపల్లిలో బీఆర్ఎస్ గెలుపొందింది. వికారాబాద్ జిల్లాలోని 4 మున్సిపాలిటీలలో 3 కాంగ్రెస్ గెలుచుకుంది.

ఈ ఎన్నికలు 70 శాతం కంటే ఎక్కువ ఓటింగ్ నమోదయింది.

**–– ములుగు మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం..**

ములుగు మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. మొత్తం 20 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ ఏకంగా 12 వార్డులను కైవసం చేసుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది.

తరువాయి 2లో



# రహ్మాన్ విజయం..

## ప్రజల విశ్వాసానికి చిహ్నం

## బంగ్లా ఫలితాలపై మోదీ పోస్ట్

ఈ కబురు : బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) విజయం సాధించింది. ఈ ఫలితాలపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్పందిస్తూ రహ్మాన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. బంగ్లా లో ప్రజాస్వామ్యయుత ప్రభుత్వానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని మోదీ హామీ ఇచ్చారు. "బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఎన్‌పీని ఘన విజయం దిశగా నడిపించిన తారిఖ్ రహ్మాన్ కు అభినందనలు. మీ నాయకత్వంపై బంగ్లా ప్రజల విశ్వాసానికి ఈ గెలుపు నిదర్శనం. ప్రజాస్వామ్య, ప్రగతిశీల సమ్మిళిత బంగ్లాదేశ్‌కు భారత్ ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తుంది. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతం, ఉమ్మడి లక్ష్యాలపై ముందుకువెళ్లేందుకు మీతో (తారిఖ్ నేతృత్వంలోని ప్రభుత్వం) కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నాం" అని ప్రధాని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

తరువాయి 2లో




3

## నెహ్రూ 'పంచశీల ఒప్పందం' అందుకే చేసుకుని ఉంటారు: సీడీఎస్

ఈ కబురు : స్వాతంత్ర్యం తర్వాత భారత్-చైనా సంబంధాల గురించి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహన్ కీలక వ్యాఖ్యలు చేశారు. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కోసమే అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1954లో పంచశీల ఒప్పందంచేసుకొని ఉంటారన్నారు.



3

## త్రిముఖ పోటీతో నష్టం జరిగింది: రాంచందర్‌రావు

ఈ కబురు , హైదరాబాద్: ఆరు మున్సిపాలిటీలో సింగల్ లార్జెస్ట్ గా అవతరించామని.. మొదటిసారి రెండు కార్పొరేషన్లు కైవసం చేసుకున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. మొత్తం కలిపి 300 పైగా వార్డు, కార్పొరేటర్లు గెలిచారు. నారాయణపేటలో గెలిచాం.

## బంగ్లా పీఠంపై 'డార్క్ ప్రిన్స్'

# భారత్‌తో స్నేహమా? రణమా?

ఈ కబురు : బంగ్లాదేశ్‌లో దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధికారం చేజిక్కించుకుంది. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మూడొంతుల మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. 60 ఏళ్ల తారిఖ్ రహ్మాన్ తదుపరి ప్రధానిగా దేశ పగ్గాలు అందుకోనున్నారు. ఒకప్పుడు విమర్శకుల చేత 'డార్క్ ప్రిన్స్'గా మాటలు పడిన రహ్మాన్ కు ఈ విజయం ఓ కొత్త ఆరంభమే. మరి ఆయన గెలుపు భారత్‌కు లాభమేనా? రహ్మాన్ రాక మనకు ఏ మేరకు ఉపయోగపడనుంది..?



తరువాయి 2లో

## 'ప్రజా పాలన' ప్రభుత్వానికి బ్రహ్మరథం.

## ...టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

ఈ కబురు, హైదరాబాద్:

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఘన విజయం అందజేసి 'ప్రజా పాలన' ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పురపాలక ఎన్నికల్లో 90కు పైగా మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లు, 1300కు పైగా వార్డులు, 154కు పైగా డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజలు తమ మద్దతును స్పష్టంగా వెల్లడించారని అన్నారు.



తరువాయి 2లో



3

## ఇంకా నిర్ణయం తీసుకోలేదు

## .. ట్రంప్ గాజా శాంతిమండలిపై భారత్

ఈ కబురు ; గాజా పునర్నిర్మాణం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'శాంతి మండలి 'ని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగం కావాలని భారత్‌కు ఇప్పటికే ఆహ్వానం అందింది.

## అభివృద్ధి, సంక్షేమానికి.. పట్టణ ప్రజలు పెద్దపీట వేశారు

- కాంగ్రెస్ ఖాతాలో 94 మున్సిపాలిటీలు, ఐదు కార్పొరేషన్లు
- రెండు కార్పొరేషన్లు హంగు
- బీఆర్ఎస్, బిజెపి కట్టు కథలను ప్రజలు నమ్మలేదు
- అత్యున్నత ప్రమాణాలతో పాలనను అందిస్తాం
- గాంధీభవన్ ప్రెస్ మీట్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ఈ కబురు, హైద్రాబాద్ ;

రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన 116 మున్సిపాలిటీలు ఏడు కార్పొరేషన్ ఎన్నికల్లో ఇప్పటివరకు అందిన ఫలితాల మేరకు 83 మున్సిపాలిటీలు, ఐదు కార్పొరేషన్ల ను కాంగ్రెస్ పార్టీ అజేయంగా కైవసం చేసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.గాంధీ భవన్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మాట్లాడారు.




తరువాయి 2లో



## వారికే ఈ విజయం అంకితం

## .. సీఎం రేవంత్ ట్వీట్

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాలలో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు. "ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితం... పార్టీ పట్ల వారికి ఉన్న అనంతమైన అభిమానానికి నిదర్శనం.. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితం" అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

తరువాయి 2లో

# కేసీఆర్‌ను కూడా ప్రజలు ఓడించారు

- నేనే రాజు నేనే మంత్రి అన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందన
- అలా అనుకున్న వారు ఎందరో గాలికి కొట్టుకుపోయారన్న కేటీఆర్
- తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను కూడా కామారెడ్డిలో ప్రజలు ఓడించారన్న కేటీఆర్



ఈ కబురు ;తెలంగాణకు 'నేనే రాజు నేనే మంత్రి' అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 'నేనే రాజు నేనే మంత్రి' అనుకునే పిచ్చి తుగ్లక్‌లు చాలామంది ఉంటారని, చరిత్రలో కూడా ఒక తుగ్లక్ ఉండేవాడని ఎద్దేవా చేశారు. అలా అనుకున్న వారు ఎందరో గాలికి కొట్టుకుపోయారని అన్నారు. ప్రజల చైతన్యాన్ని ఎవరూ తక్కువ అంచనా వేయవద్దని అన్నారు. ఈ దేశంలో ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ వంటి నాయకులు సైతం ఓడిపోయారని గుర్తు చేశారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ వంటి నాయకుడిని కూడా కామారెడ్డిలో దురదృష్టవశాత్తూ ప్రజలు ఓడించారని అన్నారు. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడో స్థానానికి వచ్చారని గుర్తు చేశారు. ఇలా నేనే రాజు నేనే మంత్రి అని రేవంత్ రెడ్డిలా విర్రవీగిన వాళ్లు వచ్చారు, పోయారని... కానీ దేశం, ప్రజల చైతన్యం అలాగే ఉందన్నారు.

తరువాయి 3లో

# సీఎం చంద్రబాబు భారీ స్కెచ్

- 2029 ఎన్నికలలో గెలుపే లక్ష్యం..!
- అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- గతంలో ఓడిన వారు కొంతమంది తిరిగి పోటీ చేసే అవకాశం
- ఆయాచోట్ల దేశం అభ్యర్థులు తిరిగి గెలిచేందుకు వ్యూహం
- కొంతమంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని స్పష్టం

(ఈ-కబురు, ఏపీ బ్యూరో)

ముఖ్యమంత్రి చంద్రబాబు 2029 ఎన్నికలలో గెలిపే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. వచ్చే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే పార్టీ నేతలను సమాయత్తం చేస్తున్నారు.



తరువాయి 3లో

## మున్సిపల్ ఎన్నికల విజయం వేళ, ప్రియాంక గాంధీతో రేవంత్ రెడ్డి భేటీ

తరువాయి 3లో



## తెలంగాణ మున్సిపల్ పోరులో

# కాంగ్రెస్ ఘన విజయం

వీరికి తోడు మరో ఇద్దరు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులు కూడా విజయం సాధించడంతో మున్సిపాలిటీపై కాంగ్రెస్ పట్టు మరింత బలపడింది. ఇక ప్రతిపక్షాల విషయానికి వస్తే, బీఆర్ఎస్ 5 వార్డులకు పరిమితం కాగా, బీజేపీ కేవలం ఒక వార్డులో మాత్రమే గెలుపొందింది. ఈ విజయంతో ములుగు పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి.విజయం సాధించిన అనంతరం కౌన్సిలర్లు ములుగు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్కను కలిశారు. ఈ సందర్భంగా ఆమె విజేతలకు శాలువాలు కప్పి, స్వీట్లు తినిపించి ఘనంగా సన్మానించారు. ములుగు అభివృద్ధి కోసం కౌన్సిలర్లు నిరంతరం శ్రమించాలని ఆమె సూచించారు. మున్సిపాలిటీ ఏర్పాటైన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన ఓటర్లకు మంత్రి సీతక్క ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు అందించిన ఈ విజయం బాధ్యతను మరింత పెంచిందని ఆమె పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఫలితాలపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ గెలుపు కేవలం రాజకీయ పార్టీ విజయం కాదని, ఇది ప్రజల ఆకాంక్షల విజయమని ఆమె అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఇచ్చిన తీర్పుగా దీనిని అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకమే ఈ విజయానికి పునాది అని ఆమె స్పష్టం చేశారు.పారదర్శకమైన, అవినీతి రహిత పాలన అందించడమే కాంగ్రెస్ లక్ష్యమని మంత్రి సీతక్క వెల్లడించారు. మౌలిక వసతుల కల్పన, ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన వంటి అంశాల వల్లనే పట్టణ ప్రజలు కాంగ్రెస్ వైపు నిలిచారని ఆమె తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రివర్గ సమిష్టి కృషితోనే ఈ అఖండ విజయం సాధ్యమైందని కొనియాడారు. గెలిచిన కౌన్సిలర్లు ప్రతి వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆమె దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో పట్టణాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు అందించిన ఆశీర్వాదాన్ని బాధ్యతగా స్వీకరిస్తూ, ప్రతి పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని సీతక్క స్పష్టం చేశారు. ఇలా ఉండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి హుజూరాబాద్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో గట్టి షాక్ తగిలింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో ప్రతి చిన్న విషయానికి ఎక్కువ హడావిడి చేసే పాడి కౌశిక్ రెడ్డి కి హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికలలో బిఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేస్తుందని ప్రకటించుకున్న ఆయనకు ఝలక్ ఇచ్చారు. హుజూరాబాద్ లో కాంగ్రెస్ హవా కొనసాగింది. వీణవంక ని తగలబెడతాం అని చెప్పి సంచలన వ్యాఖ్యలు చేసిన పాడి కౌశిక్ రెడ్డి గులాబీ పార్టీ జెండాను హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రజలు తగలబెట్టేశారు. హుజురాబాద్ మున్సిపాలిటీలో ఎన్నికల కౌంటింగ్ లో కాంగ్రెస్ పార్టీ దూసుకుపోయింది. ఏకంగా 16 వార్డులను కైవసం చేసుకుని ఏకపక్ష విజయాన్ని సాధించింది. అధికార బీఆర్ఎస్ కేవలం 8 స్థానాల కు, బిజెపి 5 వార్డులలో మాత్రమే గెలిచి మూడవ స్థానానికి పరిమితమైంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సెంటిమెంట్ అస్త్రంతో విజయం సాధించిన కౌశిక్ రెడ్డి ఆ తర్వాత అనేక వివాదాలలో హైలెట్ కావడం, నియోజకవర్గ అభివృద్ధి కంటే హడావిడి చేయడం పైనే దృష్టి సారించడం ప్రధానంగా కనిపిస్తుంది. ఈ క్రమంలోనే ఈ ఎన్నికలలో పాడి కౌశిక్ రెడ్డి ఎంత ప్రచారం చేసినప్పటికీ హుజురాబాద్ ప్రజలు బీఆర్ఎస్ ను ఆదరించలేదు.



-- జనసేన పార్టీ ఫలితాలు విశ్లేషకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు దిశగా దూసుకెళ్తున్న తరుణంలో, కొన్ని చోట్ల చిన్న పార్టీలకు కూడా అవకాశాలు లభించాయి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పురపాలిక 14వ వార్డులో జనసేన అభ్యర్థి ఆరూరి విజయలక్ష్మి 60 ఓట్ల మెజారిటీతో గెలవడం ఆ పార్టీకి ఉత్సాహాన్ని ఇచ్చింది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 34వ డివిజన్లో 31 ఓట్ల మెజార్టీతో కార్పొరేటర్ గా జనసేన అభ్యర్థి అగ్గు సాగర్ గెలుపొందారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను వెనక్కు నెట్టడం స్థానిక స్థాయిలో ఓ రాజకీయ సందేశంగా భావిస్తున్నారు. ఈ ఒక్క విజయాన్ని రాష్ట్ర స్థాయి ప్రభావంగా చూడాలా? లేక స్థానిక సమీకరణాల ఫలితంగా చూడాలా? అన్నది విశ్లేషణకు వస్తోంది. నేరేడుచర్లలో వ్యక్తిగత ఇమేజ్, స్థానిక సమస్యలపై ఫోకస్, వార్డు స్థాయి క్యాంపెయిన్ కీలకంగా పనిచేసి ఉండొచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ 336 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. ప్రారంభంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రచారానికి వస్తారని ప్రకటించినప్పటికీ, అది అమలులోకి రాలేదు. ప్రచారం జరిగినా గెలిచే పరిస్థితి లేదని కొందరు విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ కొనసాగుతున్న నేపథ్యంలో జనసేనకు స్పష్టమైన ఓటు బ్యాంక్ కనిపించలేదనే అభిప్రాయం వినిపిస్తోంది. ఎన్నికలకు పవన్ కళ్యాణ్ ప్రచారానికి వచ్చినట్లయితే మరింత మెరుగైన ఫలితాలు వచ్చేవని పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా హైదరాబాదులో మున్సిపాలిటీ లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించి, కాంగ్రెస్ పార్టీ హవా నిలుపుకుంది.

## రహ్మాన్ విజయం..

### ప్రజల విశ్వాసానికి చిహ్నం

### బంగ్లా ఫలితాలపై మోదీ పోస్ట్






299 పార్లమెంట్ స్థానాలు ఉన్న బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలంటే 150 మంది సభ్యుల సంఖ్యాబలం అవసరం. తాజా ఎన్నికల ఫలితాల్లో 212 స్థానాల్లో విజయం సాధించినట్లు బీఎన్‌పీ ప్రకటించింది. 70 సీట్లకు పరిమితమైన జమాత్‌ఏఇస్లామీ పార్టీ ఓటమిని అంగీకరించింది. బీఎన్‌పీ నాయకుడు తారిఖ్ రహ్మాన్ తదుపరి ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అవినీతి కేసుల నేపథ్యంలో 17 ఏళ్ల క్రితం దేశం నుంచి వెళ్లిపోయిన రహ్మాన్ ఇటీవలే బంగ్లాదేశ్‌కు తిరిగొచ్చిన సంగతి తెలిసిందే. తల్లి జియా ఖాలిదా మరణంతో పార్టీ పగ్గాలను అందుకున్న ఆయన.. తాజా ఎన్నికల్లో బీఎన్‌పీని విజయం దిశగా నడిపించారు. దీంతో రెండు దశాబ్దాల తర్వాత ఈ పార్టీ మళ్లీ అధికారంలోకి రానుంది. ఇదిలాఉండగా.. బీఎన్‌పీ విజయంతో భారత్‌బంగ్లా బంధం మళ్లీ బలపడే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ పార్టీతో భారత్‌కు చెప్పుకోదగ్గ స్థాయిలో సంబంధాలు లేకపోయినా.. దాన్నొక ప్రజాస్వామ్య పార్టీగా చూస్తోంది. ఆ పార్టీతో సంబంధాలు పునరుద్ధరించుకునే సంకేతాలు ఇటీవల కాలంలో కన్పిస్తున్నాయి. రహ్మాన్ తల్లి జియా ఖాలిదా ఆ మధ్య తీవ్ర అనారోగ్యానికి గురికాగా.. ప్రధాని మోదీ నాడు ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతుండంతో ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన విభేదాలు వచ్చిన సంగతి తెలిసిందే.

## బంగ్లా పీఠంపై 'డార్క్ ప్రిన్స్'

# .. భారత్‌తో స్నేహమా? రణమా?

**–17 ఏళ్ల ప్రవాసం వీడి..**

బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రహ్మాన్, మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడే తారిఖ్ రహ్మాన్. 20022006 మధ్య ఖాలిదా జియా అధికారంలో ఉన్న సమయంలో రహ్మాన్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. ఆ సమయంలోనే ఆయనపై పలు అవినీతి కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వానికి సమాంతరంగా పాలన సాగిస్తున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి. దీంతో అమెరికా సహా బంగ్లా విపక్షాలు ఆయనను 'డార్క్ ప్రిన్స్'గా అభివర్ణించాయి. హసీనా అధికారంలోకి వచ్చిన తర్వాత రహ్మాన్ ఓ కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ తర్వాత అనారోగ్యానికి గురై చికిత్స నిమిత్తం 2008లో లండన్ వెళ్లిపోయారు. అప్పటినుంచి అక్కడే నివసిస్తూ అక్కడినుంచే బీఎన్‌పీ కార్యకలాపాలను పర్యవేక్షించారు. గతేడాది డిసెంబరులో తల్లి ఖాలిదా జియా అనారోగ్యానికి గురవడంతో 17 ఏళ్ల తర్వాత మళ్లీ సొంతగడ్డపై అడుగుపెట్టారు. తల్లి మరణానంతరం పార్టీ పగ్గాలు అందుకున్నారు. నిరసనలు, హింసాత్మక ఘటనలతో అస్థిరంగా మారిన దేశంలో మళ్లీ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని తీసుకొచ్చే దిశగా విస్తృత ప్రచారం చేపట్టారు. 'బంగ్లా ఫస్ట్' నినాదంతో యువతను ఆకర్షించారు. అవి ఫలించి తాజా ఎన్నికల్లో ఘన విజయాన్ని దక్కించుకున్నారు.

**——భారత్ స్నేహ వీచిక..**

ఇటీవల కాలంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. షేక్ హసీనా గద్దె దిగడం, మైనార్టీలైన హిందువులపై బంగ్లాదేశ్‌లో దాడులు ఇరుదేశాల బంధాన్ని ఊగిసలాటలో పడేశాయి. రెండు దేశాల మధ్య గత 18 నెలలుగా ద్వైపాక్షిక సమావేశాలు జరగలేదు. ఈ పరిణామాల వేళ ఎన్నికల్లో రహ్మాన్ విజయం కీలకంగా మారింది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. చైనా, పాకిస్థాన్ కంటే ముందుగానే బంగ్లాదేశ్‌లో నూతన నాయకత్వాన్ని స్వాగతిస్తూ భారత ప్రధాని పోస్ట్ చేశారు. ప్రజాస్వామ్య, ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు భారత్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మోదీ పోస్ట్‌కు బీఎన్‌పీ ధన్యవాదాలు తెలిపింది.

**——రహ్మాన్ రాక సానుకూలమే కానీ..**

ఈ ఎన్నికలను భారత్ ముందునుంచీ నిశితంగా గమనించింది. ముఖ్యంగా జమాత్‌ఏఇస్లామీ పార్టీని తారిఖ్ రహ్మాన్ దూరం పెట్టడం భారత్‌కు కలిసొచ్చింది. ఆ పార్టీ ప్రాబల్యం లేకపోతే.. న్యూదిల్లీ విషయంలో రహ్మాన్ సానుకూలంగా వ్యవహరించే అవకాశం ఉందనేది రాజకీయ విశ్లేషకుల మాట. గతంలో రహ్మాన్ తల్లి ఖాలిదా జియా హయాంలో భారత్‌తో సంబంధాలు అంతంతమాత్రంగానే ఉండేవి. నాడు బంగ్లాదేశ్ మనతో పూర్తిగా బంధం తెంచుకోలేదు కానీ.. మిత్రపక్షంగా మాత్రం కొనసాగలేదు. అయితే, ఇప్పుడు రహ్మాన్ నేతృత్వంలో పరిస్థితి మునుపటిలా ఉండకపోవచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. రహ్మాన్ విదేశీ విధానాలు ఖాలిదాకు భిన్నంగా ఉండటమే ఇందుకు కారణం. భారత్ ప్రయోజనాలను గౌరవిస్తామని స్వయంగా ఆయనే ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. తాను 'రీసెట్' కోరుకుంటున్నానని, అయితే, అది రెండు దేశాల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇక, ఉగ్రవాదంపై పోరుకు సహకరిస్తామని, తీస్తా నదీ జలాల సమస్యను పరిష్కరించుకుంటామని, హిందూ మైనార్టీలకు రక్షణ కల్పిస్తామని ఎన్నికల ముందు ఆయన హామీ ఇచ్చారు. సరిహద్దు నియంత్రణ విషయంలో రహ్మాన్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై భారత్ దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, పశ్చిమ బెంగాల్, అస్సాంలో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో అక్రమ వలసదారుల అంశమే ఎన్నికల్లో కీలకంగా మారింది. భారత్, బంగ్లాదేశ్ 4,100 కిలోమీటర్ల మేర సరిహద్దును పంచుకుంటున్నాయి. 2024 జూన్ తర్వాత నుంచి దాదాపు 1000కి పైగా చొరబాటు ఘటనలు చోటుచేసుకున్నాయి.



**——మనతో వాణిజ్యమూ కీలకాంశమే..**

భారత్, బంగ్లాదేశ్ మధ్య ఏటా 14 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం జరుగుతోంది. అయితే, ఇందులో దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు మనకు వాణిజ్య మిగులే ఉంటోంది. మన దేశం నుంచి బంగ్లాదేశ్ టీ, కాఫీ, ఆటో విడిభాగాలు, విద్యుత్, ఉక్కు, స్టీల్, ప్లాస్టిక్, పత్తి వంటివి దిగుమతి చేసుకుంటోంది. బంగ్లా పత్తి దిగుమతుల్లో 80శాతం మన దేశం నుంచే వెళ్తోంది. ఇది ఆ దేశ ఆర్థికవ్యవస్థకు అత్యంత కీలకం. కాబట్టి దేశ ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకుని భారత్‌తో రహ్మాన్ దౌత్య సంబంధాలు నెరిపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## అభివృద్ధి, సంక్షేమానికి..

# పట్టణ ప్రజలు పెద్దపీట వేశారు




. ఇంకా కొంత సమాచారం రావాల్సి ఉంది మా స్థానాలు మరిన్ని పెరుగుతాయి అన్నారు. స్వతంత్రులు, ఇతర పార్టీల వారు మాతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నారు చివరకు మొత్తంగా 116 మున్సిపాలిటీలకు గాను 90 నుంచి 94 మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో జమ అవుతాయని స్పష్టం చేశారు. ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరగగా ఐదు కార్పొరేషన్లలో కాంగ్రెస్ తిరుగులేని మెజారిటీ సాధించింది మరో రెండు చోట్ల హంగ్ ఏర్పడింది అన్నారు. అక్కడ బిజెపి, కాంగ్రెస్, ఇండిపెండెంట్ లు ఉన్నారు, పూర్తి వివరాలు వచ్చిన తర్వాత ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది అన్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ పార్టీకి ఇంత పెద్ద ఎత్తున మున్సిపల్ స్థానాలు రావడం సంతోషం కలిగించే విషయం అన్నారు. అభివృద్ధి ,సంక్షేమం విశ్వసనీయతకు రాష్ట్ర ప్రజలు పెద్దపీటవేశారని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని, రాష్ట్ర ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని ఈ ఫలితాలతో తేటతెల్లమైందని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలోని బిఆర్ఎస్, బిజెపి నేతలు ప్రతిరోజు గాలి కబుర్లు చెబుతూ కట్టు కథలు వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పైన కాంగ్రెస్ పార్టీ పైన చేస్తున్న విమర్శలను గమనించి రాష్ట్ర ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన తీర్పును ఇచ్చారని అన్నారు. పట్టణ ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వం బాధ్యత మరింత పెరిగింది అత్యున్నత ప్రమాణాలతో పాలన అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత ఈ ఫలితాలతో స్పష్టమైందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో, ఆ తర్వాత కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆ తరువాత పంచాయతీ ఎన్నికల్లో వరుసగా ప్రజా ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారని, ప్రతిపక్షాలు ఈ విషయాన్ని గమనంలో పెట్టుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రసారమాధ్యమాల్లో కనిపించాలని, ప్రజల్లో ఉనికిని కాపాడుకోవాలని ప్రతిపక్షాలు కట్టు కథలు అల్లడం, తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలనీ డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని, రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఉండాలని ప్రజాస్వామ్య వాదిగా తాను బలంగా కోరుకుంటానని డిప్యూటీ సీఎం తెలిపారు. సంపూర్ణ విజయం కోసం శ్రమించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## వారికే ఈ విజయం అంకితం

# .. సీఎం రేవంత్ ట్వీట్



'అదేవిధంగా.. రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలన, పేదమధ్య తరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారు. ఈ విజయం మా బాధ్యతను మరింత పెంచింది. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితమవుతూ.. భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌లను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ప్రజా పాలన' ప్రభుత్వానికి బ్రహ్మరథం

### ...టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పారదర్శక పాలన అందిస్తున్న నేపథ్యంలో ప్రజలు విశ్వాసంతో కాంగ్రెస్‌కు ఓటు వేశారని ఆయన పేర్కొన్నారు. సామాన్యుల సంక్షేమం, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ లక్ష్య సాధనకు ప్రజలు మరోసారి ఆశీర్వాదం అందించారని తెలిపారు. వరుస విజయాలతో పార్టీపై రాష్ట్ర అభివృద్ధి బాధ్యత మరింత పెరిగిందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కు అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రజలు వాటిని నమ్మకుండా అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేశారని అన్నారు. నగరాలు, పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, విద్యుత్ వంటి అంశాల్లో స్పష్టమైన ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.ఈ విజయాన్ని సాధించేందుకు కృషి చేసిన పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలు, నాయకులు అందరికీ టీపీసీసీ అధ్యక్షుడు అభినందనలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత పారదర్శకంగా, ప్రజాకేంద్రిత పాలన అందిస్తూ తెలంగాణను దేశంలో ఆదర్శ రాష్ట్రంగా నిలపడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.



# నెహ్రూ 'పంచశీల ఒప్పందం' అందుకే చేసుకుని ఉంటారు: సీడీఎస్




దేహ్రాదూన్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీడీఎస్.. భారత్‌చైనా చారిత్రక సంబంధాలపై ప్రసంగించారు. ఆ ఒప్పందంలో భాగంగానే టిబెట్‌ను చైనాలో భాగమని భారత్ గుర్తించిందన్నారు. "బ్రిటిషర్లు వెళ్లిపోయిన తర్వాత.. సరిహద్దు ప్రాంతాలను నిర్ణయించుకునే అవకాశం భారత్‌కు వచ్చింది. తూర్పున మెక్‌మోహన్ రేఖ, లద్దాఖ్‌లోని ప్రాంతాల గురించి నెహ్రూకు అవగాహన ఉండి ఉండొచ్చు. కానీ, ఈ ప్రదేశంపై (టిబెట్ సరిహద్దు ప్రాంతం) కాదు. అందుకే ఆయన చైనాతో పంచశీల ఒప్పందంపై ముందుకెళ్లారని భావిస్తున్నా. ఇదే చైనీయుల విషయానికొస్తే.. టిబెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని వారు సరిహద్దుల నుంచి లాసా (టిబెట్‌లోని నగరం), షిన్‌జియాంగ్‌లకు వెళ్లిపోయారు. ఈ ప్రత్యేక ప్రాంతం రెండు దేశాలకు ఎంతో ముఖ్యమైనదిగా మారింది. అందుకే చైనీయులు ఇక్కడ స్థిరత్వాన్ని కోరుకున్నారు. ఆ సమయంలో భారత్ కూడా చైనాతో మంచి సంబంధాలు కొనసాగించాలని భావించింది. ఈ క్రమంలోనే 1954లో టిబెట్‌ను చైనాలో భాగంగా గుర్తించింది. పంచశీల ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి" అని సీడీఎస్ చౌహాన్ వివరించారు. పొరుగు దేశాలు ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదని, శాంతియుతంగా ముందుకు సాగాలనే ఉద్దేశంతో భారత్‌చైనాల మధ్య 1954లో పంచశీల ఒప్పందం (ఐదు సూత్రాలు) జరిగింది. నాటి భారత ప్రధాని నెహ్రూ, చైనా ప్రధాని చౌ ఎన్‌లైలు సంతకాలు చేశారు. అయితే, చైనా వైఖరి చూస్తుంటే ఈ ఒప్పందం కేవలం వాణిజ్యం కోసమేనని అర్థమవుతోందని.. సరిహద్దు అంశంలో ఇది ఏమాత్రం ప్రతిబింబించలేదని సీడీఎస్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ.. వాస్తవాధీన రేఖ (LAC) సున్నిత ప్రాంతంగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు.

# మున్సిపల్ ఎన్నికల విజయం వేళ, ప్రియాంక గాంధీతో రేవంత్ రెడ్డి భేటీ

**మున్సిపల్ ఎన్నికల్లో విజయంపై ప్రియాంక గాంధీ అభినందన**

**సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే ప్రజలు పట్టం కట్టారన్న ముఖ్యమంత్రి**

**ప్రజాపాలనకు ఈ ఫలితాలు నిదర్శనమన్న మల్లు భట్టివిక్రమార్క**


ఈ కబురు: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన వేళ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీతో భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ భారీ విజయం సాధించడంపై వారి మధ్య చర్చ జరిగింది. అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దక్కించుకోవడంపై హర్షం వ్యక్తం చేసిన ప్రియాంక గాంధీ... రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీతో రేవంత్ రెడ్డి అన్నారు.

కాంగ్రెస్ గెలుపుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పందించారు. రెండున్నరేళ్ల ప్రజాపాలనకు ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజలు పట్టం కట్టారని అన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం, విశ్వాసం ఆదరణగా మారిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా శ్రమించారని ప్రశంసించారు.



## అమెరికా బహిష్కరణ.. ఒక్కో వలసదారుడిపై రూ.కోటి ఖర్చు!



ఈ కబురు : అమెరికాలో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ .. ఇటీవల భారీ సంఖ్యలో బహిష్కరిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇందుకోసం ట్రంప్ యంత్రాంగం భారీగా ఖర్చు పెడుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల దాదాపు 300 మంది వలసదారులను నేరుగా వారి సొంత దేశాలకు కాకుండా, ఇతర దేశాలకు పంపించేందుకు 40 మిలియన్ డాలర్లు (సుమారు రూ.362 కోట్లు) ఖర్చు పెట్టినట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఈ క్రమంలో ఒక్కో వ్యక్తి కోసం సుమారు రూ.కోటి ఖర్చు చేసినట్లు తెలిపింది. పేద దేశాలైన ఈక్వటోరియల్ గినియా, రువాండా, ఎల్ సాల్వడార్, ఎస్వాటిని, పలావుకు చెందిన వలసదారులను బహిష్కరించడంలో భాగంగా వారికి ఏకమొత్తంలో చెల్లింపులు చేసేందుకు 4.7 మిలియన్ డాలర్ల నుంచి 7.5 మిలియన్ డాలర్ల వరకు ఖర్చు పెట్టినట్లు తాజా నివేదిక పేర్కొంది. అయితే, నేరుగా వారిని సొంత దేశాలకు కాకుండా ఇతర దేశాలకు పంపించి, అక్కడ నుంచి వారి స్వదేశానికి వెళ్లేందుకు చెల్లింపులు చేయడం కోసం భారీగా ఖర్చు చేసినట్లు తెలిపింది. ఈ క్రమంలో వెనెజువెలాకు చెందిన 250 మందిని ఎల్ సాల్వడార్‌కు పంపించగా.. మితగా వారిని ఇతర దేశాలకు తరలించినట్లు పేర్కొంది. అక్రమ వలసదారులపై ట్రంప్ అవలంబిస్తున్న విధానాలు, పెడుతున్న ఖర్చుపై సెనెట్ విదేశీ వ్యవహారాల కమిటీలోని డెమోక్రటిక్ సభ్యులు ఈ నివేదిక రూపొందించారు. బహిష్కరణ కోసం భారీగా ఖర్చుపెడుతున్నారని, ఇదంతా వృథాయేనని పేర్కొన్నారు. అంధకారంలో కొనసాగుతున్న ఈ విధానంపై తక్షణ పర్యవేక్షణ అవసరమని సూచించారు. అయితే, విదేశాంగ శాఖ మాత్రం వీటిని సమర్థించుకుంటోంది. నేరాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను అరెస్టు చేసి వెనక్కి పంపిస్తున్నామని, తమ దేశంలో ఇటువంటి వారు ఉండకూడదని విదేశాంగమంత్రి మార్కో రుబియో ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే.

## రిటైర్డు ఉద్యోగికి రూ. 90 లక్షలు టోకరా

ఈ కబురు ; రిటైర్డు ఉద్యోగికి సైబర్‌నేరగాళ్లు రూ. 90 లక్షలు టోకరా వేశారు. నాగోల్‌కు చెందిన బాధితుడి ఫోన్ నంబర్‌ను 'ఏ9 వెల్త్ అలయన్స్ ట్రైనింగ్ టీమ్' అనే వాట్సాప్ గ్రూప్‌నకు యాడ్ చేశారు. యాప్ 'టోటెమ్‌పీఎం' గూగుల్ ప్లే స్టోర్‌లో ఉంటుందని దానిని డౌన్‌లోడ్ చేసుకొని యూజర్ నేమ్, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలని సూచించారు. మేం చెప్పే టిప్స్‌ను తెలుసుకొని భారీ లాభాలు ఆర్జించండంటూ సూచనలు చేశారు. నమ్మిన బాధితుడు దఫ దఫాలుగా డబ్బులు చెల్లించాడు. ఐపీఓలు కేటాయించడం, ఆ తరువాత విక్రయించడంతో స్క్రీన్‌పై అధిక లాభాలు కన్పిస్తున్నాయి. ఇలా రూ. 90 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. అయితే విత్ డ్రా ఆప్షన్‌ను సైబర్‌నేరగాళ్లు తొలగించారు. రూ. 64 లక్షల విలువైన లక్ష షేర్లు కేటాయించామని ఆ డబ్బు చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. తన వ్యాలెట్‌లో నుంచి డబ్బు తీసుకొని చెల్లిస్తానంటూ కోరినా, అందుకు నేరగాళ్లు నిరాకరించారు. ఇదంతా మోసమని తెలుసుకొని బాధితుడు మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



## రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎంరాహత్' ..రూ.1.5 లక్షల నగదు రహిత చికిత్స

ఈ కబురు : ప్రధానమంత్రి కార్యాలయం కొత్త భవనం సేవాతీర్థ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు పథకాలకు ఆయన ఆమోదం తెలిపారు. అందులో 'పీఎంరాహత్' ఒకటి . రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించే లక్ష్యంతో దీనిని తీసుకువచ్చారు. రూ.1.5 లక్షల మేర నగదు రహిత చికిత్స అందనుంది. నిధుల కొరత కారణంగా ప్రాణాలు కోల్పోకుండా దీని ద్వారా కాపాడుకోవచ్చు. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో దీనిని లాంచ్ చేశారు. రోడ్డు ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తీసుకువచ్చిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఒకవేళ తమవద్ద సౌకర్యాలు లేకపోతే వెంటనే మరో ఆసుపత్రికి పంపాల్సి ఉంటుంది. అందుకోసం సదరు ఆసుపత్రి వారే రవాణా సౌకర్యాలు కల్పించాలి. బాధితుడు డిశ్చార్జి అయిన తర్వాత వైద్య సేవలు అందించిన ఆసుపత్రి అందుకు సంబంధించిన బిల్లును ప్యాకేజీకి అనుగుణంగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రమాదం జరిగిన నాటి నుంచి ఏడు రోజుల వరకు ఈ సేవలు పొందొచ్చని గతంలో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. మరోవైపు లక్‌పతీదీదీల సంఖ్యను మార్చి 2029 నాటికి రెట్టింపు చేసేలా కేంద్రం లక్ష్యం విధించుకుంది. ఇప్పటివరకు 3 కోట్లుగా ఉన్న టార్గెట్‌ను ఆరు కోట్లకు పెంచారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు నిధులను రూ.2 లక్షల కోట్లకు పెంచారు. దేశ స్టార్టప్ వ్యవస్థను వేగవంతం చేసేందుకు రూ.10 వేల కోట్ల నిధులు కేటాయిస్తూ మోదీ సంతకాలు చేశారు.

# సీఎం చంద్రబాబు భారీ స్కెచ్

పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా ఆ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇంఛార్జ్ లతో సమీక్ష చేస్తున్నారు. ముందుగా మచిలీపట్నం పైన సమీక్ష చేసిన చంద్రబాబు,ప్రత్యేకంగా గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల పైన సేకరించిన సమాచారం పార్టీ నేతల ముందు ఉంచారు. చేపట్టాల్సిన కార్యాచరణ పైన దిశా నిర్దేశం చేసారు. మిషన్ 2029 లో భాగంగా ఎట్టి పరిస్థితుల్లో తిరిగి సీట్లు నిలబెట్టుకోవాలని సీఎం నేతలకు తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు సిద్దం చేస్తున్నారు. కీలక నియోజకవర్గాల క్షేత్ర స్థాయి నివేదికలతో సమీక్షలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల సమయం లోనే ఎమ్మెల్యేలతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ప్రతీ అసెంబ్లీ లో ఎమ్మెల్యే పని తీరు,పార్టీ పరిస్థితి,సర్వే తాజా నివేదికల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ఖరారు చేస్తున్నారు. అందులో భాగంగా నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, ఇన్‌చార్జి మంత్రితో సమావేశాలు ప్రారంభించారు. ఒక్కొక్కరి ప్రోగ్రెస్ రిపోర్టులను సిద్ధం చేశారు. మచిలీపట్నం లోక్‌సభ నియోజక వర్గ నేతలతో వారి క్షేత్ర స్థాయి నివేదికలను వివరిస్తూ వారికి రోడ్ మ్యాప్ ఫిక్స్ చేసారు. ఎమ్మెల్యే ల పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్టులను సీల్డ్ కవర్లలో వారికి అందజేశారు. మచిలీపట్నం లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పామర్రు, పెనమలూరు, గుడివాడ నియోజకవర్గాల పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. మచిలీపట్నం, గన్నవరం, పెడన సెగ్మెంట్ల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు. కాగా అవనిగడ్డ నియోజకవర్గంలో కూటమి పార్టీల నడుమ సమన్వయం పూర్తిగా లోపించిందని, వెంటనే సరి దిద్దుకోవాలని సూచించారు. అక్కడి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ టీడీపీ నుంచి జనసేనలోకి వెళ్లినా,టీడీపీ వారిని కలుపుకొని వెళ్లడంలో అంత చొరవ చూపడం లేదని సీఎం వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ జిల్లా ఎమ్మెల్యేలకు అందు బాటులో ఉండడం లేదన్నారు. ఆయన జిల్లాకు వచ్చేది కూడా తక్కువేనని చెప్పారు. ఇకపై ఆయన పద్ధతి మారాలని హెచ్చరించారు. కలెక్టర్ పనితీరు బాగుందని ఎమ్మెల్యేలందరూ చెప్పారు. ఎస్పీ పనితీరుపై కొందరు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. అన్నీ సరిదిద్దుతానని సీఎం హామీ ఇచ్చారు. ఇక రాజకీయంగా గన్నవరం నుంచి వల్లభనేని వంశీ, గుడివాడ నుంచి కొడాలి నాని తిరిగి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయటం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నియోజకవర్గాల పైన టీడీపీ నాయకత్వం స్పెషల్ ఫోకస్ చేసింది. 2024 ఎన్నికల్లో ఈ ఇద్దరినీ టీడీపీ అభ్యర్థులు ఓడించారు. కాగా, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ఫలితం రిపీట్ చేయాలని టీడీపీ పట్టుదలతో ఉంది. దీంతో రానున్న రోజుల్లో ఈ రెండు నియోజకవర్గాల్లో చోటు చేసుకునే రాజకీయం ఆసక్తి కరంగా మారనుంది. ఏది ఏమైనా ముఖ్యమంత్రి చంద్రబాబు 2029 ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

తిరిగే అధికారం చేపట్టే దిశగా అడుగులు ఇప్పటినుంచి వేస్తున్నారు. దానికి అనుగుణంగా పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నారు. పనితీరు బాగున్న ఎమ్మెల్యేలను అభినందిస్తూనే, పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరును సర్వే ఆధారంగా మార్చుకోవాలని చంద్రబాబు హితవు పలుకుతున్నారు. అంతేకాకుండా కూటమి సభ్యులతో కలిసి నడవాలని పేర్కొంటున్నారు.

## త్రిముఖ పోటీతో నష్టం జరిగింది రాంచందర్‌రావు



గతం కంటే ఇపుడు మెరుగయ్యాం. ఎన్నికల్లో మేము మేనిఫెస్టో ఇచ్చాం. ప్రభుత్వ తప్పిదాల పై ఛార్జ్ షీట్ కూడా ప్రకటించాం. చాల చోట్ల స్వల్పంగా ఓడిపోయాం. త్రిముఖ పోటీలో నష్టం జరిగింది" అని రాంచందర్‌రావు పేర్కొన్నారు. "ప్రతి జిల్లాలో ప్రాతినిధ్యం సాధించాం. ఖమ్మం కొత్తగూడెం లాంటి ప్రాంతాల్లో కూడా ఒకటి గెలిచాం. అధికార దుర్వినియోగం వల్లే కాంగ్రెస్ గెలిచింది. కాంగ్రెస్ పార్టీకి ఇది క్లియర్ మెజారిటీ కాదు. బీఆర్ఎస్ కూడా గతం కంటే వెనకబడింది. బీఆర్ఎస్‌ది రెండో స్థానం అనుకోవడం కాదు.. గతం కంటే వెనుకబడ్డారు. బీజేపీకి ఓటు శాతం పెరిగింది. బీజేపీ ఓటింగ్ ప్రాంతాల్లోనే మజ్లీస్ పార్టీ, బీఆర్ఎస్.. కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. ఉత్తర తెలంగాణలో ముస్లిం పాపులేషన్ ఉంది. వాళ్ల ఓట్ల వల్లనే బీఆర్ఎస్, కాంగ్రెస్ అక్కడ గెలిచింది, కాంగ్రెస్ బీఆర్ఎస్, మజ్లీస్ ఒక్కటి అయ్యాయి" అని రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు.

## ఇంకా నిర్ణయం తీసుకోలేదు ..ట్రంప్ గాజా శాంతిమండలిపై భారత్



అయితే ఈ ప్రతిపాదనపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తాజాగా భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. ఈ బోర్డులో భాగం కావాలని అమెరికా ప్రభుత్వం నుంచి భారత్ కు ఆహ్వానం అందిందని, అయితే ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని, దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఈ బోర్డుకు సంబంధించి ఫిబ్రవరి 19న జరిగే తొలి సమావేశానికి భారత్ హాజరవుతుందా అన్నదానిపై మాత్రం స్పష్టత లేదన్నారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం కోసం చేసే ప్రయత్నాలకు తాము నిరంతరం మద్దతు ఇస్తున్నామని పునరుద్ఘాటించారు. గాజాతో సహా మొత్తం ప్రాంతంలో శాశ్వత శాంతికి మార్గం సుగమం చేసే అన్ని కార్యక్రమాలను ప్రధాని మోదీ స్వాగతించారన్నారు. ఇక, స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా గత నెలలో ట్రంప్ ఈ శాంతిమండలిని ప్రారంభించారు. గాజాలో శాంతి నెలకొల్పేందుకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన ఈ మండలికి ట్రంప్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

--మోదీ రాజకీయ భవిష్యత్తుపై ట్రంప్ వ్యాఖ్యల వీడియో.. స్పందించిన భారత్

ప్రధాని మోదీ రాజకీయ జీవితంపై గతంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యల వీడియో తాజాగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనిపై రణధీర్ జయస్వాల్ స్పందించారు. 'నేను ఆ వీడియో చూడలేదు. అయితే ఆ వీడియో నిజంగా ఉంటే.. అది నిజమైనా, అబద్ధమైనా దానిపై తగిన చర్యలు తీసుకుంటాము' అని అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడంపై గతేడాది భారత్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి అని ప్రశంసిస్తూనే.. 'ఆయన రాజకీయ భవిష్యత్తును నాశనం చేయడం ఇష్టం లేదు' అని వ్యాఖ్యానించారు. తాజాగా భారత్ అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతుండటం గమనార్హం.

## కేసీఆర్‌ను కూడా ప్రజలు ఓడించారు



పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో తాము పూర్తి స్పష్టతతో ఉన్నామని కేటీఆర్ అన్నారు. తన ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంత విశ్వాసం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి ఉప ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. పదిచోట్ల ఉప ఎన్నికలు వస్తే అప్పుడు ప్రజలు తేల్చుతారని అన్నారు.

## హైదరాబాద్‌లో అక్రమ సరోగసీ రాకెట్... లేడీ డాక్టర్ ను అరెస్ట్ చేసిన ఈడీ

ఈ కబురు హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన అక్రమ సరోగసీ రాకెట్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు చేపట్టింది. ఈ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలపై డాక్టర్ అడుతూరు నమ్రత అలియాస్ పచ్చిపల్లి నమ్రతను శుక్రవారం అరెస్ట్ చేసింది. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరచగా, ఫిబ్రవరి 26 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్ పేరుతో నమ్రత ఈ అక్రమ దందా నడిపినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. సంతానం లేని దంపతుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి, వారికి సరోగసీ ద్వారా బిడ్డను అందిస్తామని నమ్మించేవారు. అయితే, పేదరికంతో బిడ్డలను పెంచుకోలేని గర్భిణులను ఏజెంట్ల ద్వారా గుర్తించి, పుట్టిన వెంటనే శిశువులను కొనుగోలు చేసేవారని ఈడీ ఆరోపించింది. ఆడ శిశువుకు రూ. 3.5 లక్షలు, మగశిశువుకు రూ. 4.5 లక్షలు చెల్లించి, వారిని సంతానం లేని దంపతులకు అమ్మేవారని దర్యాప్తులో వెల్లడైంది.

ఈ రాకెట్‌పై గతంలోనే హైదరాబాద్ గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి అభియోగాలపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆ కేసుల్లో 2025 నవంబర్‌లో బెయిల్‌పై విడుదలైన ఆమె, మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఈడీ విచారణకు సహకరించకపోవడంతో తాజాగా పీఎంఎల్ఏ చట్టం కింద అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని ఆసుపత్రి లైసెన్సు రద్దు కాగా, విశాఖపట్నం కేంద్రంగా ఈ దందాను కొనసాగించినట్లు ఈడీ గుర్తించింది.

దంపతులనే అసలు తల్లిదండ్రులుగా చూపిస్తూ నకిలీ జనన ధృవపత్రాలు సృష్టించినట్లు కూడా ఈడీ తెలిపింది. ఈ రాకెట్‌లో ఏజెంట్లు, సబ్ఏజెంట్ల నెట్‌వర్క్ కీలకంగా వ్యవహరించిందని, దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వివరించారు.పూర్తి స్పష్టతతో ఉన్నామని కేటీఆర్ అన్నారు. తన ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంత విశ్వాసం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి ఉప ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. పదిచోట్ల ఉప ఎన్నికలు వస్తే అప్పుడు ప్రజలు తేల్చుతారని అన్నారు.

## ఏఐ సంస్థ ఆంథ్రోపిక్‌పై ఎలాన్ మస్క్ అక్కసు




'క్లాడ్ చాట్‌బాట్' సృష్టికర్త, అమెరికా కంపెనీ ఆంథ్రోపిక్ తన కొత్త ఏఐ టూల్ 'క్లాడ్ కోవర్క్ ఏజెంట్'ను ఆవిష్కరించిన విషయం తెలిసిందే. లీగల్, సేల్స్, మార్కెటింగ్, డేటా అనాలసిస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ కోసం ఈ ప్లగ్ఇన్‌లు ఉపయోగపడనున్నాయి. ఈ నేపథ్యంలో తమ పరిశోధనలు, ఆవిష్కరణలు మరింత పెంచడానికి 30 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఈ క్రమంలో కంపెనీ మొత్తం విలువ 380 బిలియన్ డాలర్ల (సుమారు రూ.34 లక్షల కోట్లు)గా లెక్కగట్టినట్లు తెలిపింది. ఈ ప్రకటనపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ (Musk) స్పందిస్తూ.. ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంథ్రోపిక్ ఏఐ శ్వేత జాతీయులు, ఆసియన్లు, చైనీయులు, పురుషులను ద్వేషిస్తోందంటూ పోస్ట్ చేశారు. ఈ దుష్ప్రవర్తనను ముందు సరిదిద్దుకోవాలని సూచించారు. ఆంథ్రోపిక్‌ను.. మిస్‌ఆంథ్రోపిక్‌గా (ఇతరులను ద్వేషించేదిగా) మారకుండా తప్పించేందుకు మీరు ఏమీ చేయలేరని దాని యాజమాన్యాన్ని విమర్శించారు. ఆంథ్రోపిక్ సంస్థ తీసుకువచ్చిన 'క్లాడ్ కోవర్క్' వల్ల మస్క్ నేతృత్వంలోని కృత్రిమ మేధ స్టార్టప్ ఎక్స్ఏఐ (xAI) కూడా పలు మార్పులకు గురవుతోన్న సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అసోసియేటెడ్ ప్రెస్ నివేదిక ప్రకారం..ఆంథ్రోపిక్ సంస్థకు ఉన్న 380 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో ఇది ఓపెన్ఏఐ (OpenAI), స్పేస్ఎక్స్ (SpaceX)లతో పాటు ప్రపంచంలోని అత్యంత విలువైన స్టార్టప్‌లలో ఒకటిగా నిలిచింది. ప్రముఖ పెట్టుబడి బ్యాంకు రినైసాన్స్ క్యాపిటల్.. ఆంథ్రోపిక్‌ను మూడో అత్యంత విలువైన ప్రైవేట్ సంస్థగా అభివర్ణించింది.

## ఐటీ స్టాక్స్ కుదేలు.. భారీ నష్టాల్లో సూచీలు




దేశీయ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి.అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు, ఏఐ భయాలు మన సూచీలను దెబ్బతీశాయి. నిన్నటి నష్టాలను కొనసాగిస్తూ.. నేటి ట్రేడింగ్‌లోనూ ఐటీ షేర్లు భారీగా పతనమయ్యాయి. ఉదయం 9.33 గంటల సమయంలో సెన్సెక్స్ 760 పాయింట్లు క్షీణించి, 82,906 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 245 పాయింట్లు పతనమై 25,561 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 8 పైసలు కోల్పోయి, 90.69గా ఉంది. నిఫ్టీ సూచీలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, హిందాల్కో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో షేర్లు నష్టాల్లో ఉన్నాయి. గురువారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి.

కృత్రిమమేధ భయాలతో మదుపర్లు అమ్మకాలకు దిగడంతో నాస్‌డాక్ రెండు శాతం మేర కుంగింది. తాజాగా విడుదలైన జాబ్‌డేటా, జనవరి ద్రవ్యోల్బణ నివేదిక త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఐటీ స్టాక్స్‌ను ఆంథ్రోపిక్ భయాలు ఇంకా వెంటాడుతున్నాయి. దీనికితోడు అమెరికాలో వెలువడిన జాబ్స్ డేటా కూడా ఐటీ షేర్లపై ప్రభావం చూపింది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోతే అమెరికన్ కంపెనీలు తమ ఖర్చులను తగ్గించుకుంటాయి. దీనివల్ల మన ఐటీ కంపెనీలకు ఆర్డర్లు తగ్గుతాయి. ఇవన్నీ మన ఐటీ షేర్లపై ప్రభావం చూపించాయి. ఈ పరిణామాలతో వరుసగా మూడో సెషన్‌లో 5.5 శాతం మేర క్షీణించాయి. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ఉన్నాయి.

## మార్కెట్ విలువలో టీసీఎస్‌ను అధిగమించిన ఐసీఐసీఐ బ్యాంక్




మార్కెట్ విలువ పరంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)ను ఐసీఐసీఐ బ్యాంక్ అధిగమించింది. 2009 జూన్ తర్వాత మళ్లీ ఇలా జరగడం ఇప్పుడే. దేశంలో మార్కెట్ విలువ పరంగా అగ్రగామి సంస్థల జాబితాలో అయిదో స్థానానికి ఐసీఐసీఐ బ్యాంకు చేరగా, టీసీఎస్ ఆరో స్థానానికి పడింది. టీసీఎస్ మార్కెట్ విలువను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ).. అధిగమించిన ఒక రోజు వ్యవధిలోనే, ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ఈ ఘనత సొంతం చేసుకుంది. గురువారం బీఎస్ఈలో టీసీఎస్ షేరు 5.41% నష్టంతో రూ.2,751.90 వద్ద ముగియగా, ఐసీఐసీఐ బ్యాంక్ షేరు 1.86% పెరిగి రూ.1,432 వద్ద స్థిరపడటం ఇందుకు కారణం.

**రెండేళ్లలో రూ.5 లక్షల కోట్ల నష్టం:**

టీసీఎస్ మార్కెట్ విలువ రూ.10 లక్షల కోట్ల కంటే తగ్గడం కూడా 2020 డిసెంబరు తరవాత ఇప్పుడే. 2024 ఆరంభంలో సంస్థ మార్కెట్ విలువ రూ.15 లక్షల కోట్లకు పైగా చేరి, గరిష్ఠస్థాయిని నమోదు చేసింది. రెండేళ్లలో రూ.5 లక్షల కోట్ల మేర మార్కెట్ విలువ ఆవిరైంది.

**ఐటీ సూచీ నేలచూపులు:**

ఆంథ్రోపిక్ ఏఐ టూల్స్ వల్ల సాఫ్ట్‌వేర్ సంస్థలకు ఇబ్బంది ఏర్పడుతుందనే భయాలు కొనసాగుతున్నాయి. దీంతోపాటు అమెరికాలో జనవరి ఉద్యోగ గణాంకాలు మెరుగ్గా నమోదు కావడంతో, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఇప్పట్లో తగ్గించే అవకాశం ఉండదని మదుపర్లు భావించారు. వడ్డీ రేట్లు తగ్గకపోతే కంపెనీలు వ్యయాలు తగ్గించుకుంటాయి. ఇందువల్ల మన ఐటీ కంపెనీలకు ప్రాజెక్టులు తగ్గుతాయని, వీటి లాభాదాయాలపై ప్రతికూల ప్రభావం పడొచ్చనే అంచనాలు పెరిగాయి. ఫలితంగా ఐటీ షేర్లలో అమ్మకాలు కొనసాగడంతో, ఐటీ సూచీ 5 శాతానికి పైగా నష్టపోయింది. బీఎస్ఈలో కోఫోర్జ్ షేరు 6.48%, టెక్ మహీంద్రా 5.99%, ఇన్ఫోసిస్ 5.79%, ఎల్‌టీఎం 5.5%, టీసీఎస్ 5.41%, హెచ్‌సీఎల్ టెక్ 4.84%, విప్రో 4.72% చొప్పున తగ్గాయి. టీసీఎస్, విప్రో షేర్లు తాజాగా 52 వారాల కనిష్ఠస్థాయిలకు చేరాయి.

## వైద్య రంగంలో....

దేశంలో పెరుగుతున్న ఆరోగ్య అవసరాలు, బీమా వ్యాప్తి వల్ల ఆసుపత్రుల రంగం పనితీరు బాగుంటుందని నమ్మే వారికోసం గ్రో మ్యూచువల్ ఫండ్ తాజాగా గ్రో బీఎస్ఈ హాస్పిటల్స్ ఈటీఎఫ్‌ను తీసుకొచ్చింది. ఈ నెల 25 వరకూ అందుబాటులో ఉండే ఈ ఫండ్‌లో కనీస పెట్టుబడి రూ.5,000. డీమ్యాట్ లేని వారికోసం ఫండ్ ఆఫ్ ఫండ్ ఉంది. ఇందులో కేవలం రూ.500లతోనే మదుపు చేయొచ్చు. ప్రధానంగా ఆసుపత్రుల్లో ఈ ఫండ్ మదుపు చేస్తుంది. ఒకే రంగంపై ఆధారపడుతుంది కాబట్టి, డైవర్సిఫైడ్ ఫండ్లతో పోలిస్తే, ఇందులో నష్టభయం కాస్త అధికంగా ఉంటుంది.

# పెట్టుబడులకు కొత్త 'బంగారు' లోకం

**స్టాక్స్, ఫండ్ల కంటే పసిడి వైపే యువత మొగ్గు**
**తక్కువ పరిమాణంలో కొనుగోళ్లు**
**వ్యక్తిగతంగానే నిర్ణయాలు**




జెన్ జీ, మిలీనియల్స్‌లో (18 నుంచి 45 ఏళ్ల వయసున్న) అత్యధికులు (62% మంది) స్టాక్స్, మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్) కంటే పసిడినే అత్యంత సురక్షిత పెట్టుబడి మార్గంగా భావిస్తున్నారని ఓ సర్వే తెలిపింది. కుటుంబ పెట్టుబడి నిర్ణయాలతో సంబంధం లేకుండా, సొంతంగానే తక్కువ పరిమాణంలో, పసిడి కొనుగోలు నిర్ణయాలను యువత తీసుకుంటున్నారని వివరించింది. దేశవ్యాప్తంగా 5,000 మంది యువత నుంచి సేకరించిన అభిప్రాయాలతో ఈ నివేదిక రూపొందించినట్లు 'స్మిట్టెన్ పల్స్ఏఐ' తెలిపింది. దీని ప్రకారం.. ప్రస్తుతం 66.7% వరకు పసిడి కొనుగోళ్లు, వ్యక్తిగత నిర్ణయాల ఆధారంగానే జరుగుతున్నాయి. ఇటీవల తమ కుటుంబం చేసిన పసిడి కొనుగోళ్ల విషయంలో, తామే నిర్ణయం తీసుకున్నామని 42.3% మంది యువత తెలుపగా.. తల్లిదండ్రులు లేదా కుటుంబంలో పెద్దవాళ్ల నిర్ణయమని 40% మంది వెల్లడించారు. 5 గ్రాముల లోపే పసిడి కొన్నామని 61.90% మంది వెల్లడించారు. 2 గ్రాముల లోపు కొనుగోలు చేసిన వాళ్లు 27.5% మంది కాగా.. 25 గ్రాముల మధ్య కొనుగోలు చేసిన వాళ్లు 34.4% మంది ఉన్నారు. రూ.25,000 నిధులుంటే, పసిడి కొంటామని 61.9% మంది పేర్కొన్నారు. దీంతో పోలిస్తే ఎంఎఫ్ (16.6%), డిపాజిట్లు (13%), షేర్లు (6.6%), క్రిప్టో (1.9%) వైపు ఆసక్తి చూపిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పుడు బ్యాంకుల్లో డిపాజిట్ చేయడం, ఎంఎఫ్‌లు, షేర్ల కొనుగోలు కంటే పసిడిలో పెట్టుబడి ఉత్తమమని 65.7% మంది తెలిపారు. మొదటి జీతంతో తొలిసారి పసిడి కొనుగోలు చేసినట్లు 24.3% మంది తెలపగా.. పెట్టుబడిగా పసిడిని కొనుగోలు చేసినట్లు 23.9% మంది వెల్లడించారు.

**ఆన్‌లైన్‌లో 5% మందే....**అన్నీ ఆన్‌లైన్‌లో కొనే యువత, బంగారం విషయంలో మాత్రం అందుకు దూరంగా ఉంటోంది. దిగ్గజ ఆభరణాల సంస్థల్లో కొనుగోళ్లకు 38.3% మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానిక విక్రయశాలలపై 34.7% మంది మొగ్గుచూపారు. 5.2% మంది మాత్రమే ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరుపుతున్నారు.

**తగ్గిన బంగారం, వెండి ధరలు** ....నాడు వాణిజ్య విభాగం: అంతర్జాతీయ విపణిలో బంగారం, వెండి ధరలు గురువారం భారీగా పతనం అయ్యాయి. భారత కాలమానం ప్రకారం రాత్రి 11.55 గంటలకు ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర 155 డాలర్లు తగ్గి, 4918 డాలర్లకు, ఔన్సు వెండి ధర 8 డాలర్లు పతనమై 75 డాలర్లకు దిగివచ్చాయి. ఫలితంగా హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,56,650, కిలో వెండి ధర రూ.2,49,760 వద్ద స్థిరపడ్డాయి.

# ఐటీ స్టాక్స్‌కు ఏమైంది? ఎందుకీ పతనం?

దేశీయ ఐటీ కంపెనీ స్టాక్స్‌లో (IT Stocks) నష్టాల పరంపర కొనసాగుతోంది. వరుసగా మూడోరోజూ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ప్రధాన ఐటీ స్టాక్స్ అయిన టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, విప్రో వంటివి నేల చూపులు చూస్తున్నాయి. కరోనా నాటి పరిస్థితిని గుర్తుచేస్తున్నాయి. ఇంతకీ దేశీయ ఐటీ స్టాక్స్‌కు ఏమైంది? ఎందుకీ పతనం?

ఐటీ స్టాక్స్‌లో శుక్రవారం కూడా అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఉదయం సెషన్‌లో ఏకంగా 5.2 శాతం మేర పతనమై 31,422 వద్ద కనిష్ఠాన్ని తాకింది. గడిచిన మూడు రోజుల్లో ఈ సూచీ 12 శాతం మేర పతనమైంది. ఒక్క ఫిబ్రవరి నెలలో దాదాపు 15 శాతంపైనే క్షీణించింది. 2020 మార్చిలో 16 శాతం పతనం తర్వాత ఆ స్థాయిలో ఐటీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కోవడం ఇదే తొలిసారి. టీసీఎస్ 6 శాతం, ఇన్ఫోసిస్ 7.5 శాతం, విప్రో 5 శాతం, టెక్ మహీంద్రా 5 శాతం చొప్పున నష్టపోయాయి. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో మధ్యాహ్నం తర్వాత ఈ స్టాక్స్ కాస్త కోలుకున్నాయి.

**కారణం ఏమిటి?.....** ఫెడ్ వడ్డీ భయాలు: జనవరి నెలకు సంబంధించి అమెరికాలో వెలువడిన జాబ్స్ డేటా ఊహించిన దానికంటే మెరుగ్గా వచ్చింది. అంటే నిరుద్యోగాల రేటు తగ్గింది. దీనివల్ల అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడం ఆలస్యం చేయొచ్చు. సాధారణంగా భారత ఐటీ కంపెనీలకు అమెరికా క్లయింట్ల నుంచి ఆర్డర్లు వస్తాయి. అధిక వడ్డీ రేట్లు ఉంటే అక్కడి కార్పొరేట్ టెక్ కంపెనీలు తమ ఖర్చులను తగ్గించుకుంటాయి. దీనివల్ల ఐటీ కంపెనీలకు ఆర్డర్లు తగ్గుతాయన్న భయాలు ఐటీ స్టాక్స్ పతనానికి కారణమయ్యాయి.

**ఏఐ భయాలు:** ఐటీ షేర్లను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భయాలు ఇంకా వెంటాడుతున్నాయి. ఇటీవల ఆంథ్రోపిక్ సంస్థ రేపిన అలజడి ఈ స్టాక్స్‌ను ఇంకా వణికిస్తూనే ఉంది.

ఏఐ వల్ల భారత ఐటీ కంపెనీల బిజినెస్ మోడల్ దెబ్బతింటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రాజెక్ట్ టైమ్‌లైన్‌లను ఏఐ తగ్గిస్తుందని, టాస్క్‌లను ఆటోమేట్ చేస్తోందని అనలిస్టులు పేర్కొంటున్నారు. దీనివల్ల ప్రస్తుతం హెడ్‌కౌంట్ ఆధారంగా చెల్లింపులు జరిగే సంప్రదాయ ఔట్‌సోర్సింగ్ మోడల్‌పై ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. మ్యాన్‌పవర్‌కు పనిగంటల ఆధారంగా కాకుండా.. ఔట్‌కమ్ ఆధారిత ప్రైసింగ్‌కు క్లయింట్లు మారే అవకాశం ఉంది. దీనివల్ల తక్కువమంది ఉద్యోగులతో పనిచేయించడం, లేఆఫ్‌లు, మార్జిన్లపై ఒత్తిడి వంటి భయాలు నెలకొన్నాయి.



**నాస్‌డాక్ డౌన్:** వాల్‌స్ట్రీట్‌లోని టెక్ సంస్థలతో కూడిన నాస్‌డాక్ నిన్నటి (గురువారం) ట్రేడింగ్ సెషన్‌లో 2 శాతం మేర కుంగింది. యాపిల్, మెటా, ఎన్విడియా వంటి టెక్ దిగ్గజాల షేర్లు పతనం అయ్యాయి. ఈ ప్రభావం మన స్టాక్స్‌పైనా పడింది. దీంతో నేడు ఐటీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి.

## భారీ నష్టాలతో ముగిసిన సూచీలు.. 25,500 దిగువకు నిఫ్టీ




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, ఐటీ, మెటల్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ వెయ్యికి పైగా పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 25,500 దిగువన ముగిసింది. మదుపర్ల సంపద రూ.7 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.472.50 లక్షల కోట్ల నుంచి రూ.465.50 లక్షల కోట్లకు క్షీణించింది. సెన్సెక్స్ ఉదయం 82,902.73 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,674.92) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 82,534.55 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1048.16 పాయింట్ల నష్టంతో 82,626.76 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 336.10 పాయింట్లు నష్టపోయి 25,471.10 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.66గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎటెర్నల్, టాటా స్టీల్, టైటాన్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4977 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## వెనెజువెలా నుంచి చమురు.. రిలయన్స్ కు అమెరికా లైసెన్స్


వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోలు చేసేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అమెరికా నుంచి లైసెన్స్ లభించింది. దీంతో తక్కువ ధరకు చమురు దిగుమతి చేసుకునేందుకు అవకాశం లభించింది. ఇప్పటికే పలు అంతర్జాతీయ ట్రేడర్లు ఈ అనుమతి పొందగా.. తాజాగా భారత్‌కు చెందిన ప్రైవేటు సంస్థకు ఈ లైసెన్స్ వచ్చింది. అయితే, దీనిపై రిలయన్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను కొన్ని రోజుల క్రితం నిర్బంధించిన అమెరికా.. ఆ దేశంలోని చమురు రంగంపై విధించిన ఆంక్షలను సడలించింది. అక్కడి చమురును విక్రయించుకునేలా వ్యాపారులకు అనుమతి ఇచ్చింది. అయితే,




201920లో అమెరికా ఆంక్షలు విధించకముందు వెనెజువెలా నుంచి ముడి చమురును రిలయన్స్ కొనుగోలు చేసేది.

## భారత్‌లో రోల్స్ రాయిస్ భారీ ప్రణాళికలు

**–యుద్ధ విమానాల ఇంజిన్ల సహ-అభివృద్ధి**
**–వెల్లడించిన సీఈఓ తూఫాన్ ఎర్గిన్‌బిల్గిచ్**




మనదేశంలో రక్షణ, ఇంధన, పౌర విమానయాన రంగాల్లో తన కార్యకలాపాలు పెంచుతామని బ్రిటన్ దిగ్గజ సంస్థ రోల్స్ రాయిస్ వెల్లడించింది. భారత తదుపరి తరం యుద్ధ విమానాల కోసం అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎమ్‌సీఏ) ప్రోగ్రామ్ కింద ఏరోఇంజిన్‌ను ఉమ్మడిగా అభివృద్ధి చేయనున్నట్లు కంపెనీ సీఈఓ తూఫాన్ ఎర్గిన్‌బిల్గిచ్ తెలిపారు. అది కూడా పూర్తిగా మేధోసంపత్తి హక్కుల బదిలీతో చేపట్టనున్నట్లు వివరించారు. ప్రస్తుతం 1,400కు పైగా రోల్స్‌రోయిస్ ఇంజిన్లు భారత త్రివిధ దళాల్లోని వివిధ రక్షణ ప్లాట్‌ఫారాలలో సేవలందిస్తున్నాయని తెలిపారు.

**సిబ్బంది సంఖ్య రెట్టింపు..**దేశంలో కంపెనీకి ఉన్న సిబ్బందిని రెట్టింపు చేసి 10,000కు చేర్చాలనీ సంస్థ భావిస్తోంది. తన అత్యాధునిక తయారీకి భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా మార్చే దీర్ఘకాల లక్ష్యంతో స్థానిక సరఫరా వ్యవస్థ వనరులను పదింతలు చేసుకోవాలనీ చూస్తోంది. దీనివల్ల పలు ఎస్ఎమ్ఈ (చిన్న, మధ్య తరహా కంపెనీలు)లకు ప్రయోజనం దక్కనుంది. 'ఇతర దేశాల్లో విజయవంతంగా మా వ్యవస్థను విస్తరించినట్లుగానే, భారత్‌లోనూ రక్షణ, విమాన, ఇంధన రంగాల్లో వృద్ధి చెందాలని భావిస్తున్న'ట్లు తూఫాన్ అన్నారు. ప్రధాని మోదీతో పాటు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్‌తో ఆయన వేర్వేరుగా సమావేశమయ్యారు. 'భారత్‌లో తన కార్యక్రమాలను పెంచుకోవాలన్న రోల్స్‌రాయిస్ ఉత్సాహాన్ని మేం స్వాగతిస్తున్నామ'ని మోదీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. హెచ్ఏఎల్, ఫోర్స్ మోటార్స్‌తో తయారీ సంయుక్త సంస్థలు; టాటా, భారత్ ఫోర్జ్, గోద్రేజ్ వంటి 100కు పైగా వెండార్లతో సోర్సింగ్ భాగస్వామ్యాలు ఈ కంపెనీకి ఉన్నాయి.

# ఓటీటీలోనూ..
# చిరు సినిమా హవా

## ఒక్క రోజులోనే.. 200 మిలియన్ల మినిట్స్



చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్‌లలో సందడి చేసి రికార్డులు సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం నెల రోజుల తర్వాత ఫిబ్రవరి 11న జీ5 వేదికగా స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. అక్కడ కూడా ఒక్క రోజులోనే రికార్డును సృష్టించింది. ఏకంగా 24 గంటల్లో 200 మిలియన్ల మినిట్స్‌ను సొంతం చేసుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ఇది ఓ కొత్త రికార్డ్ అని సంస్థ వెల్లడించింది. థియేటర్‌లోనే కాదు.. ఓటీటీలోనూ మరిన్ని రికార్డులు తన ఖాతాలో వేసుకోవడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా రూ.375 కోట్లు వసూలు చేసి చిరు కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల లిస్ట్‌లో చేరింది. ఈ విజయంపై చిరంజీవి గతంలో మాట్లాడారు. "వెండితెర మీద నన్ను చూడగానే మీరు వేసే విజిల్స్, చప్పట్లే నన్ను నడిపించే శక్తి. రికార్డులు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ, మీరు నాపై కురిపించే ప్రేమ మాత్రం శాశ్వతం" అని అన్నారు. నయనతార హీరోయిన్‌గా కనిపించిన ఈ చిత్రంలో వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించి నవ్వులు పూయించారు.

# విష్వక్‌సేన్‌కు విజయం దక్కిందా?
## ఫంకీ..రివ్యూ

**ఫంకీ; నటీనటులు:** విశ్వక్‌సేన్, కయాదు లోహర్, నరేశ్, వీటీవీ గణేశ్ తదితరులు; సంగీతం: భీమ్స్ సిసిరోలియో; ఎడిటింగ్: నవీన్ నూలి; సినిమాటోగ్రఫీ: సురేశ్ సారంగం; నిర్మాత: నాగవంశీ, సాయి సౌజన్య; దర్శకత్వం: కేవీ అనుదీప్; విడుదల: 13-02-2026



విష్వక్‌సేన్ వరుస సినిమాలతో అలరిస్తున్న విజయం దక్కి చాలా రోజులే అయింది. 'జాతి రత్నాలు'తో ఊహించని విజయాన్ని అందుకున్నారు దర్శకుడు కేవీ అనుదీప్. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన తాజా చిత్రమే 'ఫంకీ'. మరి ఈ మూవీ ఎలా ఉంది? ఎలాంటి వినోదాన్ని పంచింది?

**ఫంకీ సినిమా కథేంటంటే.......** కోమల్ (విష్వక్‌సేన్) ఓ కొత్త దర్శకుడు. మంచి ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థలో అవకాశం అందుకుని రూ.4 కోట్లలో పూర్తి చేస్తానని చెప్పి 'ఫంకీ' అనే సినిమాని మొదలు పెడతాడు. ఆ బడ్జెట్ కాస్త రూ.40 కోట్లకు చేరినా సినిమా పూర్తి కాదు. దాంతో మంచి నిర్మాత (నరేశ్) ఒత్తిడికి గురై ఆస్పత్రిలో చేరాల్సి వస్తుంది. అది తెలుసుకున్న నిర్మాత కుమార్తె చిత్ర (కయాదు లోహార్) సినిమా బాధ్యతల్ని తీసుకుంటుంది. బడ్జెట్ పెరగకుండా దర్శకుడితో మూవీ చేయిస్తానని చెప్పి, రంగంలోకి దిగుతుంది. మరి అనుకున్న బడ్జెట్‌లోనే కోమల్‌తో సినిమాని పూర్తి చేయించిందా?అది పూర్తయ్యేలోపు ఆ ఇద్దరి మధ్య ఏం జరిగింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

**--ఎలా ఉందంటే..** కథ కంటే ఇందులో నవ్వులే కీలకమని నిర్మాత నాగవంశీ ముందే ప్రేక్షకుల్ని సిద్ధం చేశారు. ఆయన చెప్పినట్టే అనుదీప్ మార్క్ పాత్రలు, సంభాషణలు ఈ సినిమాకి కీలకం. అయితే సినిమాకి కథ కూడా అవసరమే అనే విషయాన్ని 'ఫంకీ' అడుగడుగునా గుర్తు చేస్తుంది. సరైన కథంటూ లేకపోతే మిగతా హంగులు ఎన్ని ఉన్నా అవేవీ పెద్దగా ప్రభావం చూపించవని ఈ సినిమా మరోమారు నిరూపిస్తుంది. 'జాతిరత్నాలు'తో తెలుగు ప్రేక్షకులకు ఓ కొత్త రకమైన హాస్యాన్ని పరిచయం చేశారు అనుదీప్. అమాయకత్వం నిండిన పాత్రలు చేసే అల్లరి, ఆ పాత్రలు మాట్లాడుకునే విధానం నుంచి పండిన హాస్యం ప్రేక్షకులకు గమ్మత్తుగా అనిపించింది. అప్పట్నుంచి అనుదీప్ ప్రతి సినిమానీ అదే పంథాలో తెరకెక్కిస్తున్నారు. 'ఫంకీ'లో కొన్ని సంభాషణలు మినహా మిగతావేవీ సరైన ప్రభావం చూపించవు. కథ కూడా సినిమా రంగంతో ముడిపడింది కావడంతో, సంభాషణలు సినీ పరిశ్రమ వాతావరణం గురించి అవగాహన ఉన్నవాళ్లకు అర్థమవుతాయే తప్ప సామాన్య ప్రేక్షకులకు పెద్దగా కిక్ ఇవ్వవు. అతిథి పాత్రలు ఇందులో చాలానే ఉన్నాయి. అయితే, ఒకట్రెండు మినహా మిగిలివన్నీ కూడా బలవంతంగానే అనిపిస్తాయి తప్ప, పెద్దగా కథకు అవసరం అన్నట్టుగా అనిపించవు. సినిమాల్లో భావోద్వేగాలు ప్రధానం. అలాంటి సినిమాని తెరకెక్కించే దర్శకుడిని భావోద్వేగాలు, బంధుత్వాల గురించి అసలేమీ తెలియని వాడిలా చూపించడం కూడా అంతగా కుదరలేదు. కథానాయిక పాత్ర సినిమాలో కీలకం. చాలా సన్నివేశాల్లో ఆమె కనిపిస్తూ, అందంతో కట్టిపడేస్తుంది. కానీ ఆ పాత్ర మాత్రం కథపై పెద్దగా ప్రభావమే చూపించదు. నరేశ్, సంపత్‌రాజ్... ఇలా మరికొన్ని పాత్రలు మినహా మిగిలిన వారికి పెద్దగా ప్రాధాన్యం లేదు. అనుదీప్ బలం ఆయన మార్క్ సంభాషణలే. ఇందులోనూ అవే పనిచేశాయి. ఇందులోనూ ఓ కథ ఉందని అప్పుడప్పుడూ అనిపించినా, ఆ వెంటనే ఆగిపోయిన సినిమాలా కథ కూడా అక్కడే ఉంటుంది తప్ప ఎంతకీ ముందుకు సాగదు. పతాక సన్నివేశాల్లో నాయకానాయికలు ఒకరికొకరు ప్రేమని వ్యక్తం చేసుకోవడం, కథానాయకుడికీ, తల్లికీ మధ్య తీర్చిదిద్దిన భావోద్వేగాలు సినిమాకి కీలకం. అయితే ఆ కీలకమైన ఎపిసోడ్‌లో కూడా పెద్దగా మేజిక్ కనిపించలేదు. దాంతో అనుదీప్ మార్క్ పంచ్‌లు, కొన్ని సెటైర్లతో కాలక్షేపం చేయించడానికి పరిమితమైంది ఈ చిత్రం.

**--ఎవరెలా చేశారంటే..** విష్వక్‌సేన్ తన పాత్రని బాగా అర్థం చేసుకుని అందులో ఒదిగిపోయే ప్రయత్నం చేశారు. అనుదీప్ మార్క్ సంభాషణల్ని ఆయన పలికిన విధానం కూడా బాగుంది. సినిమాలో ఒక్కోచోట బొద్దుగా, మరోచోట సన్నగా కనిపించారు. కథానాయిక కయాదు లోహార్ చిత్ర పాత్రలో అందంగా కనిపించింది. నరేశ్, సంపత్‌రాజ్ మినహా మిగిలిన పాత్రలకు పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు. భీమ్స్ స్వరపరిచిన పాటలు బాగున్నాయి. చిత్రీకరణ కూడా మెప్పిస్తుంది. విజువల్స్ నాణ్యంగా ఉన్నాయి. అనుదీప్ ఇదివరకు తీసిన 'జాతిరత్నాలు' ఒక ప్రత్యేకమైన చిత్రంగా నిలిచింది. అలాంటి మేజిక్‌లు ప్రతిసారీ సాధ్యం కాదు. కానీ, అనుదీప్ మాత్రం మళ్లీ మళ్లీ అలాంటి కామెడీతోనే సినిమా చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు అనిపిస్తుంది. పరిమితులతో సినిమాని నిర్మించినట్టు చాలా సన్నివేశాలు చాటుతాయి.




# స్ట్రీమింగ్‌కు సిద్ధమైన 'శ్రీ చిదంబరం గారు'..
## మలయాళం మూవీని తలపించేలా..




మలయాళం కంటెంట్‌కి ఏమాత్రం తీసిపోని విధంగా రూపొందిన తెలుగు సినిమా 'శ్రీ చిదంబరం గారు'. వైకల్యం మనిషికే కానీ, మనసుకు కాదని చాటిచెప్పే కథతో తెరకెక్కింది. థియేటర్లలో విడుదలై, ప్రేక్షకుల హృదయాల్ని హత్తుకున్న ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. 'ఈటీవీ విన్' (ETV Win)లో ఈ నెల 19 నుంచి స్ట్రీమింగ్ కానుంది. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ, గోపీనాథ్ ప్రధాన పాత్రల్లో వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రమిది. ఈ సినిమా కథేంటంటే?: సోలమన్ (వంశీ తుమ్మల) చిన్నప్పట్నుంచే ఆత్మన్యూనతతో బాధపడుతూ పెరుగుతాడు. తనకున్న మెల్లకన్ను కారణంగా అసలు పేరుని పక్కన పెట్టి చిదంబరం అని పిలుస్తుంటారు. తన కన్నే తనకు శాపంగా భావిస్తూ దాన్ని దాచి పెట్టేందుకు కళ్లద్దాలు ధరించడం అలవాటు చేసుకుంటాడు. చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో చదువును మధ్యలోనే ఆపేసి నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ.. తండ్రి చేసిన అప్పుల్ని ఒకొక్కటిగా తీరుస్తుంటాడు. అదే ఊరికి చెందిన లీల (సంధ్య)ని ఇష్టపడతాడు. కానీ, ఆ విషయాన్ని ఆమె ముందు చెప్పేంత ధైర్యమే ఉండదు.

ఓ రోజు ధైర్యం చేసుకుని లీలకు తన ప్రేమను చెబుతాడు. 'ముందు నిన్ను నువ్వు ప్రేమించుకో, కళ్లద్దాల చాటున దాచుకోకుండా బయటకు కనిపించు' అని చెబుతుంది లీల. ఆ విషయం సోలమన్‌కి ఎలా అర్థమైంది?ఆత్మన్యూనతతో బాధపడుతున్న అతడు ఆ మాటల తర్వాత ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడు? ఆ ఇద్దరూ ఒక్కటయ్యారా లేదా?అన్నది కథలో కీలకం.

## విన్యాసం మొదలే...



శ్రీవిష్ణు కథానాయకుడిగా యదునాథ్ మారుతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'విష్ణు విన్యాసం'. నయన్ సారిక కథానాయిక. సుమంత్ నాయుడు.జి నిర్మాత. హేమ, షాలిని సమర్పకులు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. 'మొదలే మొదలే...' అంటూ సాగే ఇందులోని రెండో గీతాన్ని ప్రేమికుల రోజుని పురస్కరించుకుని శుక్రవారం విడుదల చేశారు. రథన్ స్వరకల్పనలోని ఈ ప్రేమగీతాన్ని రామజోగయ్యశాస్త్రి రచించగా, మధుశ్రీ, నరేశ్ అయ్యర్ ఆలపించారు. ఈ పాటలో నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ కూడా అందరినీ ఆకట్టుకుంటుందని సినీ వర్గాలు చెప్పాయి.

# 'అనగనగా ఒక రాజు'




ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్లలో విడుదలైన సినిమాల్లో 'అనగనగా ఒక రాజు' ఒకటి. ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్ ఖరారైంది. ఈనెల 11 నుంచి 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కానుంది. గోదావరి నేపథ్యంతో కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన 'అనగనగా ఒక రాజు' పండగ సినిమా అనిపించుకుంది. తన కామెడీ టైమింగ్ ఎలాంటిదో హీరో నవీన్ పొలిశెట్టి ఈ చిత్రంతో మరోసారి నిరూపించారు. ఆయనకు జోడీగా నటించిన మీనాక్షి చౌదరి అందం, అభినయంతో ఆకట్టుకున్నారు. ఈ మూవీలో చమ్మక్ చంద్ర, 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేమ్ బుల్లిరాజు, రావు రమేశ్ తదితరులు సందడి చేశారు. దర్శకుడు మారి తెరకెక్కించిన ఈ సినిమా జనవరి 14న విడుదలైన సంగతి తెలిసిందే. రూ.100+ కోట్లు కలెక్ట్ చేసిన సందర్భంగా.. హీరో నవీన్‌కు ప్రొడ్యూసర్ నవీన్ ఎర్నేని తాజాగా కంగ్రాట్స్ చెప్పారు. తమ కాంబినేషన్‌లో మరో మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా అని తెలిపారు.

**--ఈ సినిమా కథేంటంటే?...**గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడు రాజు (నవీన్ పొలిశెట్టి). జమీందార్ మనవడు అనే పేరు తప్ప ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ కాలం గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కెయొచ్చని భావించి, ఆమె మనసుని గెలచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి, చారులత మనసుని ఎలా గెలిచాడు? ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగుపెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అన్నదే మిగతా కథ.

## ప్రేమికుల రోజుకి తగ్గ సినిమా

"ప్రేమికుల రోజు సమయానికి.. దానికి తగ్గ జానర్‌లో వస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'" అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ట్రైలర్ చూసినప్పుడే ఇది కచ్చితంగా హిట్ అవుతుందనే నమ్మకం కలిగిందని తెలిపారు. సంతోశ్ శోభన్ మానస వారణాసి జంటగా నటించిన ఈ చిత్రాన్ని అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో పి.అజయ్ కుమార్ రాజు నిర్మించారు. ఇది ఈరోజు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. హీరో శ్రీవిష్ణు, దర్శకులు అనిల్ రావిపూడి, మేర్లపాక గాంధీ, నందిని రెడ్డి, అభిలాశ్ రెడ్డి, నిర్మాత స్వప్న దత్ అతిథులుగా పాల్గొన్నారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ.. "ట్రైలర్ చూశా. విజువల్స్, సంగీతం.. అన్నీ బాగున్నాయి" అన్నారు. "ఈ సినిమా భావోద్వేగాలతో నిండిన ప్రయాణంలా కనిపిస్తోంది" అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. సంతోశ్ శోభన్ మాట్లాడుతూ.. "ఇది లోతైన భావోద్వేగాలతో నిండిన సినిమా" అన్నారు.

# ప్రేమికులొస్తున్నారు..






ప్రేమని ఎన్నో సినిమాల్లో ఎన్నో రకాలుగా వర్ణించారు. ఆ మాటకొస్తే ప్రేమలేని సినిమానే అరుదు. అయినా సరే... ఎప్పటి కప్పుడు కొత్తగా మరో ప్రేమకథ తెరకెక్కేందుకు సిద్ధమవుతూ ఉంటుంది. అదే ప్రేమలోని మహత్తు! 'ఆద్యంతమూ లేని అమరానందమే ప్రేమ...' అన్నారు ప్రసిద్ధ కవి ఆచార్య ఆత్రేయ. అలాంటి ప్రేమని వర్ణించడానికి ఎన్ని సినిమాలైనా ఏం సరిపోతాయి మరీ! తెలుగులో ప్రస్తుతం కొన్ని ప్రేమకథలు సెట్స్‌పై ఉన్నాయి, మరికొంతమంది కథానాయకులు నయా ప్రేమికులుగా కెమెరా ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. 'ప్రేమ అనేది ఎంపికా లేక అవసరమా అంటే తెలియదు. తలరాత అని మాత్రం తెలుసు. అది రావాలనుకుంటే వద్దు అని చెప్పే అవకాశమే ఉండదు' అంటున్నాడు సంతోశ్ శోభన్... 'ఫ్రెండ్లీ కపుల్' సినిమాతో! ప్రతి ప్రేమదీ ఓ అనుభవం మరీ! 'ప్యార్ అనేది ఒక కిరాక్ నషా...' అంటాడు కొత్త హీరో హర్షిత్ రెడ్డి... ఇటీవల విడుదలైన 'దీవానా' ప్రచార చిత్రంతో! ప్రతి ప్రేమికుడిదీ ఓ కొత్త నిర్వచనం మరీ! రెండక్షరాల ప్రేమ ఇలా ఎన్ని భావాల్ని దాచుకుందో! ఎన్నెన్ని భావోద్వేగాలకు నెలవైందో! అందుకే ప్రతి ప్రేమకథ తెరపైన ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ ఎప్పటికప్పుడు సరికొత్తగా గిలిగింతలు పెడుతుంటుంది ప్రేమ. మన కథానాయకులు ప్రేమకథలపై మనసు పడటానికి కారణం అదే.

**కథలు సిద్ధం....**ప్రేమకథలకి పెట్టింది పేరు నాగచైతన్య. ఆయన విజయాల్లో ఎక్కువ వాటా ప్రేమకథలదే! ఆ మాటకొస్తే అక్కినేని కుటుంబ కథానాయకులందరూ తెరపై ప్రేమికులుగా కనిపించి అలరించినవాళ్లే. 'ఏ మాయ చేసావె' మొదలుకొని, గతేడాది వచ్చిన 'తండేల్' వరకూ నాగచైతన్య ప్రేమకథల్లో ఒదిగిపోయారు. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా చేస్తున్న ఆయన, తదుపరి మరో ప్రణయగాథకి పచ్చజెండా ఊపారు. క్లాక్స్ అనే దర్శకుడు ఆ కథని సిద్ధం చేశారు. గీతా ఆర్ట్స్ సంస్థలో రూపొందనున్న ఆ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. మరో కథానాయకుడు సాయి దుర్గా తేజ్ కూడా తదుపరి రెండు ప్రేమకథలు చేస్తున్నట్టు సమాచారం. అందులో ఓ చిత్రం 'క'తో విజయాన్ని అందుకున్న సుజీత్, సందీప్ దర్శకద్వయం తెరకెక్కించనున్నారు. 'ఛాంపియన్'గా ఇటీవల ప్రేక్షకుల్ని మెప్పించిన శ్రీకాంత్ తనయుడు రోషన్ తదుపరి చిత్రం ప్రేమకథతోనే తెరకెక్కబోతోంది. శైలేశ్ కొలను దర్శకత్వం వహించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇన్నాళ్లుగా థ్రిల్లర్ సినిమాలతోనే ప్రయాణం చేస్తూ వచ్చిన శైలేశ్ కొలను తెరకెక్కిస్తున్న తొలి ప్రేమకథ ఇదే.

**సెట్స్‌పై చాలానే...** 'మొదటి ప్రేమకు మరణం లేదు, అది మనసు పొరల్లో శాశ్వతంగా సమాధి అవుతుంది' అంటూ 'బేబి' సినిమాతో తొలిప్రేమ ప్రత్యేకతని హృద్యంగా ఆవిష్కరించారు దర్శకుడు సాయిరాజేశ్. ఆయనే ఈసారి... 'మొదటి ప్రేమ ఒక్కటే నిజమైతే అందరి కథలూ తల్లి ప్రేమ దగ్గరే ఆగిపోవాలి కదా...' అంటూ మరో కొత్త కోణంలో కథని రాశారు. కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా రవి నంబూరి దర్శకత్వంలో రూపొందుతున్న 'చెన్నై లవ్‌స్టోరి' అదే. 'చరిత్రలో ఎన్నో గొప్ప ప్రేమకథలు ఉన్నాయి, వాళ్లందరికీ ఇవి మొదటి ప్రేమకథలే కావు కదా, ఫస్ట్‌లవ్ ఫెయిల్ అయ్యిందంటే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలవుతుందని అర్థం' అంటూ విడుదలైన ఆ సినిమా ప్రచార చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ప్రస్తుతం చిత్రీకరణని చేసుకుంటోంది ఆ చిత్రం. ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న 'డ్యూయెట్', 'ఎపిక్' సినిమాలూ ప్రేమని ఆవిష్కరించేవే. స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రం 'సీతారామం'తో దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించారు దుల్కర్ సల్మాన్. ఆయన కథానాయకుడిగా ఎస్.ఎల్.వి సినిమాస్ పతాకంపై రూపొందుతున్న భారీ చిత్రం కూడా ప్రేమకథతోనే తెరకెక్కుతున్నట్టు సమాచారం. రవి నేలకుడితి దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. భారీ బడ్జెట్ సినిమాలు, పాన్ ఇండియా హంగుల కారణంగా గతంతో పోలిస్తే తెలుగులో ప్రేమకథలు తక్కువే అయినా, యువ కథానాయకులు మంచి ప్రేమకథ వచ్చిన ప్రతిసారీ వాటిపై ప్రత్యేకమైన ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు.

# స్నేహిత్ శుభారంభం



వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చెన్నై స్టార్ కంటెండర్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ శుభారంభం చేశాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 100వ ర్యాంకర్ స్నేహిత్ 9-11, 11-8, 8-11, 11-7, 11-6తో భారత్‌కే చెందిన దివ్యాంశ్ శ్రీవాస్తవపై నెగ్గి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. భారత్‌కే చెందిన ఆకాశ్ పాల్, అంకుర్, హర్మీత్ కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు.

# బెల్జియం చేతిలో భారత్ పరాజయం





ప్రో హాకీ లీగ్ కొత్త సీజన్‌ను భారత పురుషుల హాకీ జట్టు ఓటమితో ప్రారంభించింది. ప్రపంచ రెండో ర్యాంకర్ బెల్జియం జట్టుతో బుధవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 1-3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టును బెల్జియం జట్టు కట్టడి చేసింది. కేవలం రెండు పెనాల్టీ కార్నర్‌లు పొందిన భారత జట్టు అందులో ఒకదానిని సద్వినియోగం చేసుకుంది. ఆట 29వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను శిలానంద్ లాక్రా గోల్‌గా మలిచాడు. బెల్జియం తరఫున నెల్సన్ ఒనానా (23వ నిమిషంలో), థామస్ క్రాల్స్ (53వ నిమిషంలో), అర్నో వాన్ డెసెల్ (57వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. తమకు లభించిన ఏడు పెనాల్టీ కార్నర్‌లను బెల్జియం వృథా చేసుకోవడం గమనార్హం. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో అర్జెంటీనాతో భారత్ ఆడుతుంది. తొమ్మిది జట్లు పోటీపడుతున్న ప్రో లీగ్‌లో తాజా గెలుపుతో బెల్జియం 16 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది.

# సత్తా చాటిన సాయితేజ.. ..యూఎస్ఏ భారీ స్కోర్



టీ20 వరల్డ్‌కప్ 2026లో భాగంగా ఇవాళ (ఫిబ్రవరి 13) రాత్రి మొదలైన మ్యాచ్‌లో యూఎస్ఏ, నెదర్లాండ్స్ జట్లు తలపడుతున్నాయి. చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో యూఎస్ఏ తొలుత బ్యాటింగ్ చేసి భారీ స్కోర్ చేసింది. టాస్ ఓడి నెదర్లాండ్స్ ఆహ్వానం మేరకు బ్యాటింగ్‌కు దిగిన యూఎస్ఏ.. సాయితేజ ముక్కామల (79), శుభ్‌మ్ రంజనే (48 నాటౌట్) సత్తా చాటడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. మిగతా యూఎస్ఏ ఆటగాళ్లలో మొనాంక్ పటేల్ (36), షయాన్ జహంగీర్ (20) కూడా రాణించారు. సంజయ్ కృష్ణమూర్తి (1), మిలింగ్ కుమార్ (3), హర్మీత్ సింగ్ (1) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. మొహమ్మద్ మొహిసిన్ ఒక్క పరుగుతో అజేయంగా నిలిచాడు. నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డి లీడ్ (40373) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. లొగాన్ వాన్ బీక్ (40281), కైల్ క్లెయిన్ (40351), ఫ్రెడ్ క్లాసెన్ (30321) కూడా పర్వాలేదనిపించారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనను నెదర్లాండ్స్ ధాటిగా ప్రారంభించింది. తొలి 5 ఓవర్లలో ఆ జట్టు 41 పరుగులు చేసింది. అయితే కీలకమైన రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. మైఖేల్ లెవిట్ 3 పరుగులు చేసి కెంజిగే బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ కాగా.. మ్యాక్స్ ఒడౌడ్ 13 పరుగులు చేసి హర్మీత్ సింగ్ బౌలింగ్‌లో మిలింద్ కుమార్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. ఈ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ గెలవాలంటే 90 బంతుల్లో మరో 156 పరుగులు చేయాలి.

## యూఎస్ఏ బోణి.. నెదర్లాండ్స్‌పై గ్రాండ్ విక్టరీ




టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ యూఎస్ఏ గ్రాండ్ విక్టరీ కొట్టింది. నెదర్లాండ్స్ తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదటి బ్యాటింగ్ చేసిన యూఎస్ఏ నిర్ణీత 20 ఓవర్లలో 196 పరుగుల భారీ స్కోర్ సాధించింది. యూఎస్ఏ బ్యాటర్లలో ముక్కమల్ల సాయితేజ(79) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచారు. అనంతరం 197 పరుగుల భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన నెదర్లాండ్స్ కేవలం 103 పరుగలకే చాప చుట్టేసింది. లక్ష్య ఛేదనలో 15.5 ఓవర్లలోనే ఆలౌట్ కాగా.. నెదర్లాండ్స్ బ్యాటర్ బాస్ డే లీడే (23) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ గెలుపుతో యూఎస్ఏ టీ20 ప్రపంచకప్‌లో బోణికొట్టింది.

# అదంతా అప్పుడండి..

## ఇప్పుడు నేను మారిపోయాను: ఇషాన్ కిషన్




పొట్టి ప్రపంచకప్‌లో భాగంగా ఈనెల 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా భారత్ , పాక్ మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో అందరి చూపు విచిత్రమైన యాక్షన్‌తో బౌలింగ్ చేస్తున్న ఉస్మాన్ తారిక్‌పైనే ఉంది. అయితే అతడిని ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని టీమ్ఇండియా బ్యాటర్ ఇషాన్ కిషన్ అన్నాడు. నమీబియాతో మ్యాచ్ అనంతరం అతడు విలేకర్లతో మాట్లాడాడు. 'మేం ఇప్పటికే అతడి (ఉస్మాన్ తారిక్) బౌలింగ్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. మేం బంతిని చూస్తూ.. మా సహజసిద్ధమైన ఆటను ఆడాల్సిన సమయం వచ్చింది. మేం స్కోర్‌బోర్డ్ మీద మంచి టోటల్ ఉంచాలనుకుంటున్నాం. కొన్ని వీడియోలు చూడటంతో అతడి బౌలింగ్ మీద మాకో అవగాహన వచ్చింది' అని ఇషాన్ కిషన్ అన్నాడు.

**'మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది'.....** న్యూజిలాండ్ సిరీస్ నుంచి తాము ఎంతో నేర్చుకున్నామని, ఆ ప్రదర్శన తమలో ఆత్మవిశ్వాసం నింపిందని ఇషాన్ కిషన్ అన్నాడు. 'పరుగులు సాధించడం బ్యాటర్లకు మంచి విషయం. గత సిరీస్ నుంచి మేం బాగా ఆడుతున్నాం. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచుల నుంచి మేం చాలా నేర్చుకున్నాం. ఆ సిరీస్‌తో మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది' అని ఇషాన్ కిషన్ వివరించాడు.

**'నా ఆట మీద ఎక్కువగా దృష్టి పెడుతున్నాను!'.....** గతంలో తాను జోక్స్‌తో ఎక్కువ కాలక్షేపం చేసేవాడినని.. ప్రస్తుతం తాను క్రికెట్‌కే ఎక్కువ సమయం కేటాయిస్తున్నానని ఇషాన్ కిషన్ అన్నాడు. 'నిజం చెప్పాలంటే నేను ఇప్పుడు మారిపోయిన మనిషినని అనుకుంటున్నాను. ఎందుకంటే నాకు జోకులంటే చాలా ఇష్టం. గతంలో నేను 24x7 జోక్స్‌తో కాలక్షేపం చేసేవాడిని. కానీ ఇప్పుడు ఆ సమయాన్ని రెండు, మూడు గంటలకు తగ్గించాను. ప్రస్తుతం బ్యాటింగ్, నా వికెట్ కీపింగ్ మీదే ఎక్కువ దృష్టి పెడుతున్నాను. ఇది జట్టుకు, అలాగే నాకూ ప్రయోజనకరం. క్రికెట్ తర్వాతే ఏదైనా' అని కిషన్ పేర్కొన్నాడు.

# పొట్టి కప్‌లో తొలి సంచలనం..

## ఆసీస్‌ను చిత్తు చేసిన జింబాబ్వే



టీ20 ప్రపంచ కప్ 2026లో ఇంకా సంచలనం ఏదీ నమోదు కాలేదంటా.. అభిమానులు అనుకుంటున్న తరుణంలో బలమైన ఆసీస్‌కు షాక్ ఇచ్చింది జింబాబ్వే. ఐసీసీ టోర్నీల్లో ఆస్ట్రేలియాను ఓడించడమంటే సాధారణ విషయం కాదు. కానీ, బ్యాటింగ్, బౌలింగ్‌తోపాటు ఫీల్డింగ్‌లోనూ చురుగ్గా వ్యవహరించిన జింబాబ్వే సత్తా చూపించింది. కంగారూ జట్టును చిత్తు చేసింది. కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై జింబాబ్వే 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 20 ఓవర్లలో 169/2 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆసీస్ 19.3 ఓవర్లలో 146 పరుగులకే పరిమితమైంది. మాట్ రెన్‌షా (65) హాఫ్ సెంచరీ చేసినా ఫలితం లేకుండా పోయింది. తన జట్టును గెలిపించలేకపోయాడు. రెన్‌షాతోపాటు గ్లెన్ మ్యాక్స్‌వెల్ (31), ట్రావిస్ హెడ్ (17) మినహా ఎవరూ రెండంకెల స్కోరు చేయలేదు. జింబాబ్వే బౌలర్ ముజర్బానీ (4/17) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతడితోపాటు బ్రాడ్ ఇవాన్స్ 3.. మసకద్జ, బర్ల్ చెరో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ముజర్బానీ నిలిచాడు.

**రాణించిన జింబాబ్వే బ్యాటర్లు....** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వేకు ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్ (64), మరుమణి (35) తొలి వికెట్‌కు అర్ధశతక భాగస్వామ్యం నిర్మించారు. మరుమణి ఔటైనా.. రైయాన్ బర్ల్ (35), సికందర్ రజా (25*)తో కలిసి బెన్నెట్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. హాఫ్ సెంచరీ సాధించి చివరి వరకూ క్రీజ్‌లో నిలిచాడు. దీంతో ఆసీస్ ఎదుట 170 పరుగులను లక్ష్యంగా ఉంచారు. ఆసీస్ బౌలర్లు స్టాయినిస్, గ్రీన్ ఒక్కో వికెట్ తీశారు. బౌలింగ్ చేస్తుండగా మరుమణి కొట్టిన బంతి స్టాయినిస్ చేతిని బలంగా తాకింది. దీంతో అతడు మైదానం వీడాడు. అయితే, లక్ష్య ఛేదన సమయంలో స్టాయినిస్ బ్యాటింగ్‌కు వచ్చినా పెద్దగా ప్రభావం చూపించలేకపోయాడు.

# పిజ్జాలు చేసిన చేతులే..

## బంతిని గింగిరాలు తిప్పి ఇటలీని గెలిపించాయి!




పొట్టి ప్రపంచకప్‌లో (ICC Mens T20 World Cup) భాగంగా ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇటలీ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులు చేసింది. ఇటలీ 12.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 124 రన్స్ చేసింది. ఇలా ఇటలీ వరల్‌డ్‌కప్‌లో తన తొలి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ ఘనత సాధించడంలో క్రిషాన్ కలుగమాగే (Crishan Kalugamage) కీలకపాత్ర పోషించాడు. తన బౌలింగ్‌లో 4 ఓవర్లలో కేవలం 18 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలిచాడు. అయితే అతడు క్రికెట్ ఆడని సమయాల్లో.. బతుకుతెరువు కోసం పిజ్జాలు తయారు చేసి విక్రయిస్తుంటాడు. ఈ విషయాన్ని ఇటలీ కెప్టెన్ హ్యారీ మనేంటి నేపాల్‌తో మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించాడు. అలాగే తమ జట్టులో 15 మంది ఉంటే.. అందులో 12 మంది క్రికెట్ లేని సమయాల్లో జీవనోపాధి కోసం ఇతర పనులు చేస్తారని వివరించాడు.

**శ్రీలంక టూ ఇటలీ..** క్రిషాన్ కలుగమాగే స్వస్థలం శ్రీలంకలోని నెగోంబో. క్రికెటంటే ప్రాణం. అరవింద డి సిల్వ అంటే ఇష్టం. అతడికి 16 ఏళ్ల వయసున్నప్పుడు వారి కుటుంబం శ్రీలంక నుంచి ఇటలీకి వలస వెళ్లింది. ఆ సమయంలో అతడు యూత్ లెవల్ క్రికెట్‌లో ప్రతిభ చాటుతున్నాడు. ఇటలీ వెళ్లాక అతడి క్రికెట్ ప్రయాణం ముగిసిందనుకున్నాడు!

**పబ్లిక్ పార్కుల్లో..** ఇటలీకి వెళ్లగానే కలుగమాగే బ్యాట్లు, బంతులు వదిలి పిజ్జాల తయారీలో నిమగ్నమయ్యాడు. అయినా వీలు చిక్కినప్పుడల్లా పార్కింగ్ స్థలాలు, పబ్లిక్ పార్కుల్లో టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడేవాడు. చివరికి రోమా క్రికెట్ క్లబ్‌లో చేరడంతో జీవితం మలుపు తిరిగింది. ఆదివారాల్లో క్రికెట్ ఆడటం కోసం పనికి వెళ్లేందుకు నిరాకరించేవాడు. దీంతో అతడు చాలా ఉద్యోగాలు మారాల్సి వచ్చింది. ఇలా తన క్రికెట్ ప్రయాణాన్ని అతి కష్టంమీద కొనసాగించాడు.

**ఫాస్ట్ బౌలర్ నుంచి స్పిన్నర్‌గా..** కలుగమాగే తొలుత ఫాస్ట్ బౌలర్‌గా ఉండేవాడు. గాయాల కారణంగా 2021 నుంచి స్పిన్ బౌలింగ్ వేస్తున్నాడు. ఎవరైనా అతణ్ని బంతిని ఎలా తిప్పగలుగుతున్నావని అడిగితే.. పిజ్జాలు తయారు చేసిన వేళ్లతో బంతిని తిప్పడం తేలికని చమత్కరిస్తాడు. భవిష్యత్తులోనైనా ఇటలీలో క్రికెట్ అభివృద్ధి చెందాలని, క్రికెటర్లు మెరుగైన జీవితం గడపాలని కలుగమాగే గురించి తెలుసుకున్న క్రికెట్ అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ఎన్నో కష్టాల కోర్చి అతడు సాగిస్తున్న క్రికెట్ ప్రయాణం ఎందరో యువ క్రికెటర్లకు నిజంగా స్ఫూర్తిదాయకమే కదా!


# మూడు పతకాలూ మనవే

**–50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత్ క్లీన్‌స్వీప్**
**–ఐశ్వర్య ప్రతాప్, నీరజ్, అఖిల్‌లకు స్వర్ణ, రజత, కాంస్యాలు**




స్వదేశంలో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గురువారం సీనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. వ్యక్తిగతవిభాగంలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలతోపాటు టీమ్ ఈవెంట్‌లో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ 362 పాయింట్లతో ప్రపంచ రికార్డు స్కోరును సాధించాడు. స్వర్ణ పతకాన్ని నెగ్గాడు. భారత్‌కే చెందిన నీరజ్ కుమార్ 361.8 పాయింట్లతో రజతం కైవసం చేసుకోగా... అఖిల్ షెరాన్ 343.5 పాయింట్లతో కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. ఐశ్వర్య ప్రతాప్, నీరజ్, అఖిల్‌లతో కూడిన భారత బృందం 1769 పాయింట్లతో టీమ్ విభాగంలో స్వర్ణ పతకాన్ని గెల్చుకుంది. జూనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత షూటర్లు అడ్రియన్ కర్మాకర్ 353.2 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని... మానవేంద్ర సింగ్ షెఖావత్ 338.6 పాయింట్లతో కాంస్య పతకాన్ని నెగ్గారు. అడ్రియన్ కర్మాకర్, మానవేంద్ర సింగ్, ప్రిన్స్‌లతో కూడిన భారత బృందం టీమ్ విభాగంలో 1741 పాయింట్లతో బంగారు పతకాన్ని సాధించింది. ఈ మెగా ఈవెంట్‌లో ఇప్పటి వరకు భారత షూటర్లు 38 స్వర్ణాలు, 16 రజతాలు, 16 కాంస్యాలతో కలిపి 70 పతకాలు సాధించారు.

# సెమీస్‌లో రష్మిక జోడీ




అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 మహిళల టోర్నమెంట్ డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక-అంకిత రైనా (భారత్) ద్వయం 7-6 (9/7), 6-3తో భారత్‌కే చెందిన వైష్ణవి-వైదేహి జంటపై గెలుపొందింది. 94 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక-అంకిత రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశారు. హైదరాబాద్‌కే చెందిన సహజ యామలపల్లికి మాత్రం నిరాశ ఎదురైంది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ (భారత్)-జుజానా పావ్లీకౌస్కా (పోలాండ్) జంట 6-4, 3-6, 6-10తో 'సూపర్ టైబ్రేక్'లో పొలీనా బఖ్‌ముత్కినా (బెల్జియం)-మరియా గొలోవినా (రష్యా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది.